www.mahanadumedia.com

జనం గుండె చప్పుడు

# మహానాడు ®

Mahanaadu Media

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం అక్టోబర్ 15, 2026 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం





# జనసేన పార్టీలోకి వంగవీటి రాధా

- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్



**మంగళగిరి:** దివంగత నేత స్వర్గీయ వంగవీటి మోహన రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

వంగవీటి రాధాకృష్ణ కి పవన్ కళ్యాణ్ స్వయంగా పార్టీ కండువా కప్పి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రాధాకృష్ణ తనతో వచ్చిన అనుచరులను పవన్ కళ్యాణ్ కి పరిచయం చేశారు. పార్టీ సిద్ధాంతాల కోసం, ప్రజా సేవలో కలిసికట్టుగా పని చేద్దామని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు సై

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు గంట మోగింది! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకమైన 2వ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్, 2026ను విడుదల చేయడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

పట్టణ స్థానిక సంస్థలు (ULBs), MPTC / ZPTC స్థానాలతో పాటు మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచార హోరు, ఓటర్ల చైతన్యం ఊపందుకోనున్నాయి.

ఎన్నికల సమరంలో కీలక ఘట్టాలు
ఈ ఎన్నికల షెడ్యూల్‌లో ప్రధాన అంశాలు:
పట్టణ స్థానిక సంస్థలు (100 ULBs):
నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 14, 2026
పోలింగ్ తేదీ: అక్టోబర్ 28, 2026
ఓట్ల లెక్కింపు & ఫలితాలు: అక్టోబర్ 30, 2026
MPTC\T & ZPTC\T:
నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 19, 2026
పోలింగ్ తేదీ: నవంబర్ 03, 2026
ఫలితాలు: నవంబర్ 05, 2026



గ్రామ పంచాయతీలు (మూడు దశల్లో):
మొదటి విడత (Phase-I): నోటిఫికేషన్ నవంబర్ 13
పోలింగ్ & ఫలితాలు: నవంబర్ 26, 2026
రెండో విడత (Phase-II): నోటిఫికేషన్ నవంబర్ 16
పోలింగ్ & ఫలితాలు: నవంబర్ 29, 2026

మిగతా.. 2లో






# ‘మున్సిపల్’లో లీకు వీరులు?

- నెల్లూరు కార్పొరేషన్ ఓసీ జనరల్ అవుతుందని ముందే అభ్యర్థిని ప్రకటించిన జగన్
- లోకేష్‌కూ తెలియక చేసిన వ్యాఖ్యలు
- వాళ్ల తెలివి అలా ఉంటుందని లోకేష్ వ్యాఖ్య
- తీరా రిజర్వేషన్లలో అదే నిజమైన వైనం
- ఎంఏయుడీలో ఒక కీలక అధికారి బొత్సకు లీక్ చేశారా?
- మంత్రి నారాయణ ఏరికోరి తెచ్చుకున్న ఫలితం
- లోకేష్‌కు తెలియని సమాచారం జగన్‌కు ఎలా తెలిసింది?
- సీఎంఓ, సచివాలయంలో వైసీపీ కోవర్టులు?
- రిజర్వేషన్లు.. వారం ముందే ఎలా తెలిసిందో..?

**అమరావతి:** సచివాలయంలో వైసీపీ కోవర్టులున్నారా? సీఎంఓలోనూ వేగులు విజయవంతంగా పనిచేస్తున్నారా? అందుకే ఇంకా ఖరారు కాని నెల్లూరు మేయర్ రిజర్వేషన్ స్థానానికి జగన్ ధైర్యంగా రెడ్డి అభ్యర్థిని ప్రకటించారా? ఈ విషయంలో మంత్రి లోకేష్ కూడా సమాచారలోపంతో తప్పులో కాలేసి కామెంట్ చేశారా? అసలు సచివాలయంలో వైసీపీ కోవర్టులు ఎవరు? మున్సిపల్ శాఖలో కీలక అధికారి ఒకరు, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణతో తనకున్న పాత అనుబంధంతో, రిజర్వేషన్ జాబితాను ముందే లీక్ చేశారా? ఇదీ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్.

వైసీపీ అధినేత జగన్ నెల్లూరు వైసీపీ మేయర్ అభ్యర్థిగా ఆనం పేరు ప్రకటించినప్పుడు అంతా ఆశ్చర్య పోయారు. ఇంకా రిజర్వేషన్ ఖరారు కాకముందే.. ఓసీ అభ్యర్థిని మేయర్ ఏ ధైర్యంతో ప్రకటించారన్నది అందరి ధైర్యం.

అయితే ఆ సమయంలో మంత్రి లోకేష్ వైసీపీ అధినేత జగన్‌పై సెటైర్లు వేశారు. ‘ఇంకా రిజర్వేషన్లు ఖరారు కాలేదు. వాళ్లు అప్పుడే ఒక రెడ్డిని మేయర్‌గా ప్రకటించారు. అట్లా ఉంటుంది వాళ్లతో’ అని వ్యంగ్యాస్త్రం సంధించారు. అయితే తీరా రిజర్వేషన్ ప్రకటించిన తర్వాత నెల్లూరు జగన్ ప్రకటించినట్లు ఓసీకే వెళ్లింది. అంటే పరిపాలనలో చక్రం తిప్పుతున్న మంత్రి లోకేష్‌కు గానీ, మున్సిపల్ మంత్రి నారాయణకు గానీ ఈ విషయం తెలియదని అర్థమవుతూనే ఉంది. మరి లోకేష్‌కే తెలియని నెల్లూరు మేయర్ రిజర్వేషన్ జగన్‌కు ఎలా తెలిసింది? జగన్‌కు రిజర్వేషన్ల జాబితాను లీక్ చేసిన ఆ లీకు వీరులెవరన్న దానిపై కూటమి వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం నెలకొంది. నిన్నటి వరకు ఒక లెక్క.. నిన్నటి నుంచి ఒక లెక్క అన్నట్లుగా లోకల్ వార్ మారిపోయింది. ఇందుకు ప్రధాన కారణం.. ఏ స్థానం ఎవరికి కేటాయిస్తారనే చర్చ కూటమి పార్టీల నేతల్లో నెలకొంది. మరీ ముఖ్యంగా పోటీ చేసేందుకు గంపెడాశలు పెట్టుకున్న ఆశావహులంతా రిజర్వేషన్ల ప్రకటన ముందు వరకు విపరీతమైన టెన్షన్ పడ్డారు.

మన ఊరు ఏ కేటగిరికి పోతుందో.. అనే టెన్షన్‌తో కూటమిలోని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల నేతలు తీవ్ర మదనపడ్డారు

మిగతా.. 2లో



గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము బుధవారం సాయంత్రం విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం శ్రీ మహా చండీదేవి అలంకారంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారి దివ్య దర్శనం, వేద ఆశీర్వచనం..



05
జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ 9 ఛార్జ్‌షీట్లు దాఖలు



03
నాణ్యతా ప్రమాణాల్లో టీజీఎస్పీడీసీఎల్ సరికొత్త మైలురాయి



7లో
## ఇప్పుడు కథ ఎమర్జెన్సీ కూడలిలో..



03
చంచల్‌గూడ “డోర్ స్టెప్” విచారణ



06
మారకపోతే సస్పెండ్ చేస్తా..



7లో
కేటీఆర్ నయా దందా.. కంపెనీలను బెదిరించి వసూళ్లు!



5లో
విజయనగరం జిల్లాకు జలకళ!



3లో
విజయవాడకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



8లో
దివ్యాంగుల పింఛన్లకు భారీ ఊరట!

# పురుగుల అన్నం ఎట్లా తినాలి సార్?

- మేం రోజూ ఇవే తింటున్నాం
- మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం
- సబ్జెక్ట్ టీచర్లు లేరు
- కరువుతో వలస పోతున్నాం
- హరీశ్‌రావు వాహనాన్ని ఆపి విద్యార్థుల ఆవేదన

**గట్టు:** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఇందువాసి గ్రామంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాన్వాయ్‌ను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆపి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజూ నాసిరకం పురుగుల అన్నం, ప్రతిరోజు వంకాయ కూర పెడుతున్నారని హరీశ్ రావు ఎదుట విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్లు



లేకపోవడంతో చదువుకు తీవ్ర ఆటంకం కలుగుతోందని, కనీస వసతులు కరువై ఇబ్బందులు పడుతున్నామని దీనివల్ల స్కూల్ డ్రాపౌట్స్ అధికంగా పెరిగాయని వాపోయారు.

అంతేకాకుండా, గ్రామంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల వల్ల చదువులు

మిగతా.. 2లో



# రామగుండం అంటేనే రణగర్జన చేసే రణరంగం

- సింగరేణి తిరగబడితే ఆనాడు దక్షిణాది రాష్ట్రాలు చిమ్మ చీకట్లో ఉండిపోయినయి
- సింగరేణి కార్మిక గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**గోదావరి ఖని:** చావుతో సహవాసం చేసే సత్తా ఉన్న కార్మిక సోదరులు ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నరా.. అంటే మన సంగిరేణిలోనే ఉన్నరని గర్వంగా చెప్పుకోవచ్చునని సింగరేణి కార్మిక గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వచ్చేటప్పుడు కరీంనగర్‌లో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ బాబు ఆపితే అక్కడ కొద్దిసేపు ఆగిన. ఏం సంగతి ఏమో గడ్డం పెంచినవ్ అని అడిగిండు. పోయేదెక్కడికి గోదావరి ఖనికి.. ఆ మాత్రం ఉండాలే కదా అని చెప్పిన. పోయేది సింగరేణికి కదా ఆ మాత్రం

మిగతా.. 2లో

# మీ పెట్టుబడులకు మా భరోసా

- సమాఖ్యలతోనే అభివృద్ధికి కొత్త బాటలు
- యువత, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి
- తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, మహానాడు:** సమాఖ్య అనే పదానికి ఎంతో బలం ఉందని, ఆధునిక యుగంలోనూ సమాఖ్యల అవసరం ఎంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఎస్‌సీసీ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఆధునిక కాలంలో వస్తున్న మార్పులను తెలుసుకోవడానికి, వాటిని అందిపుచ్చుకోవడానికి సమాఖ్యలు ఉపయోగ పడ తాయని పేర్కొన్నారు.

కొత్త తరం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందినవారు వివిధ హోదాల్లో రాణించడమే కాకుండా ఉన్నత శిఖరాలకు ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలిచారని చెప్పారు. వారి విజయగాథలను సమాఖ్య నిక్షిప్తం

మిగతా.. 2లో

## తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భరోసా..

- తెలంగాణలో ప్రభుత్వ విధానాలు స్థిరంగా కొనసాగుతాయి.. పెట్టుబడులు సురక్షితం
- రాబోయే రోజుల్లో తయారీ రంగం విస్తరణపై ప్రత్యేక దృష్టి
- ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో తెలంగాణ పోటీ పడుతోంది
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

2లో

# అమ్మ చేతి అన్నం, ఇప్పుడు నిండుగా

నెల మధ్యలో బియ్యం డబ్బా అడుగు కనిపించినప్పుడు అమ్మ గుండె ఒక్క క్షణం ఆగుతుంది. పిల్లలకు తెలియనివ్వదు. “ఇంకా ఉందిలే” అంటూ నవ్వుతూనే, మనసులో లెక్కలు వేసుకుంటుంది. కూరగాయలు, పాల ప్యాకెట్లు, ఇతర ఖర్చుల మధ్యలో బియ్యం ధర కూడా పెరిగిపోతుంటే, మధ్యతరగతి ఇంట్లో ఆ నిశ్శబ్ద ఆందోళన ఎంత బరువో ఆ అమ్మకే తెలుసు.

అలాంటి ఇళ్లకోసం ఇప్పుడు ఒక చల్లని కబురు. పేరు “ధరణి”. భూమాతను గుర్తు చేసే ఈ పేరుతో, రైతుబజార్ల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం తక్కువ ధరకే అందుతోంది.

కర్నూలు సోనా కిలో రూ.50, బీపీటీ కిలో రూ.49

రైతు పండించిన గింజ, మధ్యలో ఎవరి భారం లేకుండా, నేరుగా మన కంచం వైపు నడిచొస్తోంది.

మొదట ఒక్కొక్కరికి 10 కిలోలే ఇచ్చారు. అంటే “ఈ వారం కొంటే, వచ్చే వారం ఉంటుందో లేదో” అనే చిన్న భయం మిగిలే ఉండేది. కానీ సోమవారం నుంచి “26 కిలోల బస్తాలు” అందుబాటులోకి వచ్చాయి. ఒక్క బస్తా ఇంటికి వస్తే, నెలంతా డబ్బా నిండుగా ఉంటుంది, అమ్మ మనసు తేలికగా ఉంటుంది.

గత వారం నిల్వల్లో కొరత వచ్చినప్పుడు ప్రభుత్వం చూస్తూ ఊరుకోలేదు. పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగి, ఎక్కడా కొరత రాకుండా సరఫరా బాధ్య తను జిల్లాల్లోని రైస్ మిల్లర్ల అసోసియేషన్లకు అప్పగించారు.

మిగతా.. 2లో




# వైఫల్యం కంటే విజయమే ఎక్కువ ప్రమాదకరం

అన్నోరి పార్టీ కోసం..

వైఫల్యం కన్నా విజయం మరింత ప్రమాదకరం

విశ్వంలోని దాదాపు అన్ని విషయాలు విరుద్ధాభాసంతో పనిచేస్తాయి.

విజయం, వైఫల్యం ఒకే నాణేనికి రెండు వైపులాంటివి.

ఒకటి లేకుండా మరొకటి ఉండదు. అయితే, విజయం అనేది చాలా ప్రమాదకరమైన విషయం అని మనం చాలా అరుదుగా పరిగణిస్తాము.

“కాలివేళ్లపై నిలబడేవాడు స్థిరంగా ఉండడు; తనను తాను ప్రదర్శించుకునేవాడు ప్రకాశవంతంగా ఉండడు; గొప్పలు చెప్పుకునేవాడు ఏమీ సాధించలేడు; మరియు, వైఫల్యం కన్నా విజయం మరింత ప్రమాదకరం”

సుమారు 2600 సంవత్సరాల క్రితం, నాయకత్వంపై లావో త్జు రాసిన, ఎంతో ప్రశంసలు పొందిన ‘తావో తే చింగ్’ గ్రంథం ఇలా చెబుతుంది. ఈ గ్రంథాన్ని ఒక సరిహద్దు రక్షకుడు రాశాడని, ఆ మహర్షి తన జ్ఞానాన్ని వెల్లడించిన తర్వాతే అతడు ముందుకు వెళ్ళడానికి అనుమతించాడని అంటారు.



అసాధారణమైన కున్‌ఫు త్జు (కన్ఫ్యూషియస్) కూడా, సాక్షాత్తు ఆ మహాశక్తివంతమైన డ్రాగన్ అయిన లావో త్జును తనకంటే ఎంతో యోగ్యుడిగా భావించాడు.

లావో త్జు అలా ఎందుకు పేర్కొన్నాడు?

మిగతా.. 2లో

www.mahanadumedia.com
జనం గుండె చప్పుడు
మహానాడు ®
Mahanaadu Media

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం అక్టోబర్ 15, 2026 ||

# అమ్మ చేతి అన్నం, ఇప్పుడు నిండుగా

మొదటి పేజీ తరువాయి..

ఇది కేవలం ఒక ధర తగ్గింపు వార్త కాదు. ఇంటి పెద్ద నుదుటిపై ముడతలు కొంచెం తగ్గే వార్త. రూపాయి రూపాయి లెక్క చూసుకునే కుటుంబాలకు, "మన గురించి ఆలోచించే వాళ్లున్నారు" అనిపించే శుభ వార్త. రేపు రైతుబజారుకు వెళ్తే, ఆ బస్తా చేతిలోకి తీసుకుని ఇంటికి నడవండి. వేడి వేడి అన్నంలో నెయ్యి కలిపి పిల్లలకు ముద్దలు తినిపించే ఆ క్షణంలో, "నిన్నటి ఆందోళన" కనిపించదు. కనిపించేది కంచం నిండా నవ్వు మాత్రమే.

# వైఫల్యం కంటే విజయమే ఎక్కువ ప్రమాదకరం

మొదటి పేజీ తరువాయి..

మానవ పరంగా విజయం, అపరిమితమైన అవకాశాలకు మరియు శక్తికి దారితీస్తుంది. అందువల్ల, లక్ష్యాన్ని సాధించిన తర్వాత ఎప్పుడు, ఎక్కడ ఆపాలో ఒకరికి తెలియదు.

విజయం విఫలమవుతుంది, ఎందుకంటే అది అహాన్ని, తద్వారా అనుబంధాన్ని సృష్టిస్తుంది. ఇది పునరావృతానికి, మార్పులేనితనానికి దారితీస్తుంది. కీర్తి ఒక చెరసాలగా మారి, కోల్పోతామనే భయాన్ని కలిగిస్తుంది.అదే కోలుకోలేని పతనానికి, వినాశనానికి నాంది.

వ్యక్తులు, సమూహాలు, సంస్థలు, సమాజాలు, కార్పొరేషన్లు, ప్రభుత్వాలు మరియు దేశాలు, అనివార్యమైన వైఫల్యానికి దారితీసిన విజయం వంటి భయంకరమైన పరిణామాలకు పదేపదే బలైపోయాయి.

ఒకవేళ ఉంటే, అది అలెగ్జాండర్ మహారాజు. సాక్షాత్తు ఆ గొప్ప తత్వవేత్త అయిన అరిస్టాటిల్ చేత తీర్చిదిద్దబడి, మార్గదర్శకత్వం వహించబడిన వ్యక్తి.

పర్షియన్లు, ఆఫ్ఘనిస్తాన్ తెగలపై మరియు స్వదేశానికి తిరిగి రాకముందు పౌరవ రాజుపై సాధించిన అద్భుతమైన విజయాలు ఉన్నప్పటికీ, అలెగ్జాండర్ ఏదో ఒక విధంగా తనను తాను అదుపులో ఉంచుకోగలిగాడు. అతను కూడా కాలం నుండి తప్పించుకోలేకపోయాడు.

20వ శతాబ్దంలో, మనం సోవియట్ రష్యా ప్రజల చరిత్ర, నాజీ జర్మనీ మరియు దక్షిణాఫ్రికా వర్ణవివక్ష పాలన గురించి తెలుసుకున్నాము, ఇవన్నీ ఘోరంగా విఫలమయ్యాయి.

మన కాలంలో మనం అదే చూస్తున్నాము: అమెరికాలోని రిపబ్లికన్ పార్టీ (GOP) దాని మితిమీరిన చర్యల కారణంగా ఓటర్ల చేతిలో చిత్తుగా ఓడిపోవడానికి సిద్ధంగా ఉంది; గాజా విషయంలో ఇజ్రాయెల్ అంతర్గతంగా చీలిపోయే ప్రమాదంలో ఉన్నందున అక్కడ కూడా ఇదే జరుగుతుందని అంచనా వేస్తున్నారు; చివరగా, ఆంధ్రప్రదేశ్ లోని టిడిపి అప్రస్తుతమైన విద్యార్థి తరం అయిన జెన్-జెడ్ (Gen Z) నుండి మరియు పార్టీలోని సొంత పార్టీ శ్రేణుల నుండి వస్తున్న తీవ్రమైన వ్యతిరేకతలు, ప్రజా వ్యతిరేకతలు కారణంగా అవమానాలను ఎదుర్కొంటోన్నాయి.

గతం,ప్రస్తుతం తిరుగులేని పార్టీగా వెలుగొందుతున్న టిడిపి... నాటి పునాదులను, నిర్మాణాన్ని కదిలించే లక్ష్యంతో ఉన్న కూడా అధిగమించలేని సవాళ్లను ప్రస్తుతం ఎదుర్కొంటున్నాయి.

అందులోనే మనం విస్మరించిన వివేకం ఉంది - సంయమనం, అధికారాన్ని అదుపులో ఉంచుకోవడం, ఆత్మవినాశానికి దారితీసే సామర్థ్యాన్ని పరిమితం చేసుకోవడం. అయినప్పటికీ, మానవజాతి తన చరిత్రను, దాని పాఠాలను అరుదుగా నేర్చుకుంటుంది.

మనమందరం జీవితంలో మన సొంత లక్ష్యాలను, మరింత సాధించాలనే ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ఒక శాశ్వతమైన పాఠం మిగిలి ఉంటుంది.

అదే పాఠం - హద్దుల్లో ఉండటం, వినయంగా ఉండటం, అహంకారాన్ని అదుపులో ఉంచుకుని విజయంలో నిలకడను సాధించడం.

మనమందరం- ఈ పార్టీల అధిష్టానాలు మరచిపోకూడని విషయం ఏమిటంటే, వైఫల్యం కంటే విజయమే ఎక్కువ ప్రమాదకరం... ఏమంటారు తమ్ముళ్లు?

# తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భరోసా..

- తెలంగాణలో ప్రభుత్వ విధానాలు స్థిరంగా కొనసాగుతాయి.. పెట్టుబడులు సురక్షితం
- రాబోయే రోజుల్లో తయారీ రంగం విస్తరణపై ప్రత్యేక దృష్టి
- ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో తెలంగాణ పోటీ పడుతోంది
- తెలంగాణతో వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యానికి బ్రిటన్ ప్రతినిధుల ఆసక్తి
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని ముఖ్యమంత్రి శ ఎ. రేవంత్ రెడ్డి బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే కొన్నేళ్లలో తయారీ రంగాన్ని భారీగా విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు.

బుధవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన మేయర్ల నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్, యార్క్ అండ్ నార్త్ యార్క్‌షైర్ మేయర్ డేవిడ్ స్కైత్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ ఈ బృందానికి నాయకత్వం వహించారు.

ఇటీవల భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (CETA) నేపథ్యంలో తెలంగాణతో వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై ఈ సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో అత్యంత యువ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అనతికాలంలోనే ఐటీ, ఫార్మా, లైఫ్



సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. తెలంగాణ ఇప్పుడు కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతోందని చెప్పారు.

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక 'తెలంగాణ రైజింగ్-2047' గురించి ముఖ్యమంత్రి వివరించారు. 2025 డిసెంబర్‌లో ఆవిష్కరించిన ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అంతర్జాతీయ నాయకులు, ప్రముఖ ఆర్థికవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తల సూచనలతో ఈ అభివృద్ధి ప్రణాళిక రూపొందిందని తెలిపారు.

కృత్రిమ మేధ (AI) విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రముఖ కంపెనీల ప్రత్యక్ష భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్‌లో రివర్‌ఫ్రంట్ ఎకానమీ, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరించారు.

అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ 2025 మే నెలలో హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

ఈ సందర్భంగా బ్రిటన్ ప్రతినిధులు తెలంగాణతో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యాన్ని ప్రత్యక్ష వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడులు, విద్యా సంస్థల మధ్య సహకారంగా మార్చేందుకు త్వరలో మరోసారి తెలంగాణలో పర్యటించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్ మాట్లాడుతూ, యార్క్‌షైర్ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన సుమారు 1.50 లక్షల వ్యాపార సంస్థలు ఉన్నాయని తెలిపారు. దేశంలో అత్యధిక తలసరి జీఎస్‌డీపీ కలిగిన రాష్ట్రంగా తెలంగాణను ప్రస్తావిస్తూ, రెండు ప్రాంతాల ఆర్థిక ప్రయోజనాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. తెలంగాణలోని డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార విస్తరణ అవకాశాలు ఎంతో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు.

వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ మాట్లాడుతూ, యార్క్‌షైర్, తెలంగాణ మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయని, రెండు ప్రాంతాలు సోదర భావంతో కలిసి పనిచేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

అంతకుముందు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బ్రిటన్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, క్లీన్ ఎనర్జీ, నాలెడ్జ్ ఆధారిత ఆర్థికాభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. ఉత్తర ఇంగ్లండ్ ప్రాంతానికి ఉన్న పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలతో తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలకు మంచి అనుసంధానం ఉందన్నారు.

ఇటీవల ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం బ్రిటన్‌లో పర్యటించి ప్రముఖ విశ్వవిద్యాలయాలు, వ్యాపార సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు తెలంగాణ కేంద్రంగా ఎదిగే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి UK--India CETA & Regional Synergies పేరుతో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిషోర్ జయరామన్, హైదరాబాద్ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు సై

మొదటి పేజీ తరువాయి..

మూడో విడత (Phase-III): నోటిఫికేషన్ నవంబర్ 19 । పోలింగ్ & ఫలితాలు: డిసెంబర్ 02, 2026

### స్థానిక పాలకులే నిజమైన నాయకులు

ప్రజాస్వామ్యానికి నిజమైన పునాది స్థానిక స్వపరి పాలనే. వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక వసతుల సాధనలో మున్సిపల్ కౌన్సిలర్ల నుండి సర్పంచుల పాత్ర అత్యంత కీలకమైనది.

ఈ ఎన్నికల ప్రత్యేకత ఏంటంటే-గ్రామ పంచాయతీల విషయంలో పోలింగ్ జరిగిన రోజే ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటించనున్నారు. ఇది ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా మార్చడంలో దోహదపడుతుంది.

రాజకీయ పక్షాలకు ఇది ఆధిపత్య పోరు కావచ్చు, కానీ సామాన్య ప్రజలకు ఇది తమ సమస్యలను పరిష్కరించే సమర్థులైన ప్రతినిధులను ఎన్నుకునే మహత్తర అవకాశం. ఓటర్లందరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకుని, నిజమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడమే ఈ ప్రజాస్వామ్య పండుగకు అసలైన సార్థకత!

# 'మున్సిపల్'లో లీకు వీరులు?

మొదటి పేజీ తరువాయి..

కూడా. ఇప్పటికే ఖర్చు భారీగా పెట్టాం.. రిజర్వేషన్‌లో మనకు రాకపోతే.. పరిస్థితి ఏమిటంటూ తెగ టెన్షన్ పడ్డారు.

కానీ వైసీపీ నేతల్లో మాత్రం ఆ టెన్షన్ లేదు. ఎందుకంటే.. పోటీ చేసే అభ్యర్థులు లేక మాత్రం అస్సలు కాదు. ఇంకా చెప్పాలంటే.. వాళ్ల అధినేతకు అన్నీ ముందే తెలుసు అనే ధీమా వైసీపీ నేతల్లో బాగా ఉంది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ అభ్యర్థి ప్రకటన. రిజర్వేషన్ ప్రకటనకు వారం రోజుల ముందే నెల్లూరు వైసీపీ మేయర్ అభ్యర్థిని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. అధికారంలో ఉన్న పార్టీ నేతలకే తెలియని విషయం.. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని పార్టీ నేతలకు ఎలా తెలిసిందనేది ఇప్పుడు హాట్ టాపిక్.

నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ సీటు ఓసీ జనరల్ అవుతుందని.. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ముందే తెలిసిందంటే.. కొందరు ప్రభుత్వ అధికారులే ఉప్పు అందించారేమో.. అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందుకే నెల్లూరు వైసీపీ మేయర్ అభ్యర్థిగా ఆనం విజయకుమార్ రెడ్డి పేరును జగన్ వారం ముందే ప్రకటించారు. టీడీపీ ముఖ్య నేతలకు కూడా తెలియని రిజర్వేషన్లు..

జగన్ మోహన్ రెడ్డి ముందే తెలుసుకోగలుగుతున్నారంటే.. వైసీపీ అభిమాన అధికారులే రిజర్వేషన్ వ్యవహారం ముందే జగన్‌కు సమాచారం ఇచ్చి ఉంటారనే మాట బాగా వినిపిస్తోంది. మరీ ముఖ్యంగా సీఎంఓ స్థాయిలోనే ఈ లీక్ జరిగిందా.. అనే చర్చ ఇప్పుడు సచివాలయ వర్గాల్లో, టీడీపీ, జనసేన పార్టీల్లో బాగా జరుగుతోంది.

నిజానికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న చాలా విషయాలు మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రకటన వచ్చే వరకు తెలియటం లేదు. కానీ వైసీపీ నేతలకు మాత్రం అన్నీ ముందే తెలిసిపోతున్నాయి. సీఎంఓ అధికారులలో ఒకరు వైసీపీ కోవర్టు ఉన్నారని.. సచివాలయంలో జగన్ కోసం పని చేసే వైసీపీ సీఐడీలు చాలా మంది ఉన్నారనేది ఎప్పటి నుంచో వినిపిస్తున్న మాట.

నెల్లూరు జిల్లా మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలకు కూడా రిజర్వేషన్ ప్రకటన వచ్చే వరకు తెలియదు. కానీ.. ఎక్కడో బెంగళూరులో ఉంటున్న జగన్‌కు మాత్రం నెల్లూరు మేయర్ సీటు ఓసీ జనరల్‌కు కేటాయిస్తున్నట్లు పది రోజుల ముందే ఎలా తెలిసిందనేది ఇప్పుడు హాట్ టాపిక్.

నెల్లూరు వైసీపీ మేయర్ అభ్యర్థిగా ఆనం విజయకుమార్ రెడ్డి పేరును వారం రోజుల క్రితమే జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారంటే.. అటు ప్రభుత్వంలోని కొందరు అధికారులతో పాటు ప్రస్తుతం టీడీపీలో ఉన్న మాజీ వైసీపీ నేతలపైనే అనుమానాలు వస్తున్నాయి. నెల్లూరు మేయర్ కుర్చీ ఓసీ జనరల్‌గా అధికారికంగా ప్రకటించిన తర్వాత కూటమి నేతలు ఆశ్చర్యానికి గురయ్యారు.

కానీ వైసీపీ నేతలు మాత్రం లైట్ తీసుకున్నారు. ప్రకటన ముందే ఎలా తెలిసిందని కూటమి నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేయగా.. మా అన్నకు అన్నీ ముందే తెలిసిపోతాయి లే.. అని వైసీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా.. ఈ లీక్‌లను అరికట్టకపోతే.. ఫలితాలు చాలా దారుణంగా ఉండే ప్రమాదం ఉంది



**భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేష్, ఆయన సతీమణి సుమన లింగమనేని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో రాష్ట్రపతిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి మెమెంటో అందచేశారు.**

# పురుగుల అన్నం ఎట్లా తినాలి సార్?

మొదటి పేజీ తరువాయి..

మధ్యలోనే మానేసి, తల్లిదండ్రులతో కలిసి కూలీ పనుల కోసం వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సమస్యలను ఓపిగ్గా



విన్న హరీశ్ రావు.. పాఠశాల దుస్థితిని విద్యార్థుల ఆవేదనను స్వయంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

# మీ పెట్టుబడులకు మా భరోసా

మొదటి పేజీ తరువాయి..

చేసి కొత్త తరానికి అందించాలని సూచించారు.

2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ లక్ష్య సాధనకు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. అందుకే 2025లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని వెల్లడించారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు.

ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఐటీ, సేవారంగాలు, అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్)గా తీర్చిదిద్దుతున్నామని, ఇక్కడ తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, రవాణా, సరుకు రవాణా రంగాలను ప్రోత్సహిస్తామని వివరించారు. మిగిలిన గ్రామీణ ప్రాంతాలను రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్)గా అభివృద్ధి చేస్తూ వ్యవసాయం, ఆహార శుద్ధి, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ ఐదు శాతం వాటా కలిగి ఉందని, దాన్ని పది శాతానికి చేర్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. నాలుగు వందల ఏళ్ల క్రితమే దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు చార్మినార్ ఒక గుర్తింపు చిహ్నంగా నిలిచిందని, ఇప్పుడు వ్యాపార రంగానికి హైటెక్ సిటీ మరో గుర్తింపు చిహ్నంగా మారిందని పేర్కొన్నారు.




రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు స్థానికులు ఎక్కువగా కార్పొరేట్ సంస్థలకు సేవలు అందించే దిశగా ఉన్నారని, ఇకపై మన ప్రాంతానికి చెందినవారు పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రపంచాన్ని పరిశీలిస్తే మహిళల భాగస్వామ్యం ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో మహిళలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు అనుసంధాన రుణాలు అందించామని తెలిపారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ కేంద్రాలకు మహిళలను యజమానులుగా చేశామని వివరించారు.

సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ యువతతో పాటు మహిళలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మంచి విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని, పెట్టుబడులకు పూర్తి భరోసా ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ఏపీ శాసనసభ ఉపసభాపతి కె.రఘురామరాజు, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీ ప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేష్ తదితరులు హాజరయ్యారు.

# రామగుండం అంటేనే రణగర్జన చేసే రణరంగం

మొదటి పేజీ తరువాయి..

ఉండాలే.. లేకపోతే నడువదు అని చెప్పిన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

గోదావరి ఖని సింగరేణి స్టేడియంలో 'సింగరేణి కార్మిక గర్జన'లో కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాటాల పురిటి గడ్డ రామగుండం అంటేనే రణగర్జన చేసే రణరంగం ఈ గడ్డ. నల్లబంగారు గనుల నుంచి తరలివచ్చిన మా కార్మిక అన్నలందరికీ హృదయపూర్వక వందనం. చెమట, నెత్తురు దారపోసి ఈ దేశానికి విద్యుత్ అందించి వెలుగులు ప్రసరించే విధంగా కష్టపడుతున్న ప్రతీ కార్మిక సోదరుడికి హృదయపూర్వకంగా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

మీకు బొగ్గు ఉత్పత్తి చేయడమే కాదు.. ఉద్యమాలను ఉత్పత్తి చేయడం కూడా బ్రహ్మాండంగా తెలుసునని కేటీఆర్ పేర్కొన్నారు. మీ అందరికీ, మా అందరికీ గుర్తుంది. ఉత్పత్తిలో మొనగాళ్లు, ఉద్యమాల్లో కూడా మొనగాళ్లు మీరు. ఆనాడు బాగా యాదికుంది.. కేసీఆర్ పిలుపునిస్తే సకలజనుల సమ్మెలో 35 రోజులపాటు ఒకసారి, 7 రోజులు ఒకసారి 42 రోజులపాటు ఒక్క బొగ్గు పెళ్ల రాకుండా మీరు ఆరోజు తిరగబడితే మొత్తం దక్షిణాది రాష్ట్రాలు చిమ్మ చీకట్లో ఉండిపోయిన మాట ఎవరూ మరిచిపోలేదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నా.

ఆ రోజుల కేసీఆర్ తెలంగాణ జెండా ఎగరేసి బయలుదేరితే ఆయనకు అండగా నిలబడ్డది.. ఇదే సింగరేణి కార్మిక లోకమనే మాట మేమెవరం మరిచిపోలేదు. ఆ రోజు కేసీఆర్ కో అంటే మీరు కోల్ బెల్ట్ మొత్తంకో అని బయలుదేరారన్నారు.

# కిడ్నీ చికిత్సకు పోతే మెడికవర్‌లో కాటికి యువ న్యాయవాది

**సికింద్రాబాద్:** కిడ్నీలో రాళ్లు తీయించుకోవడం కోసం కార్పొరేట్ హాస్పిటల్‌లో చేరిన ఓ యువ న్యాయవాది ప్రాణమే పోయింది. మూత్రపిండంలో రాయిని తీస్తే మెదడులో రక్తస్రావమై చనిపోయిందని వైద్యులు చెప్పడంతో బంధువులు, తోటి అడ్వకేట్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే యువతి చనిపోయిందని, హాస్పిటల్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు.





బంధువులు, న్యాయవాదులు తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరికి చెందిన సుధీర్‌కుమార్- గాయత్రీదేవి కూతురు ఐశ్వర్య (28) జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలు పెట్టింది. 40 రోజుల క్రితమే పట్టాభి తో వివాహం జరిగింది. ఇటీవల కడుపులో నొప్పి రావడంతో వైద్యుల దగ్గర చూపించుకోగా కిడ్నీలో రాళ్లు ఉన్నాయని చెప్పారు. దానితో ఆపరేషన్ కోసం ఈ నెల 7న సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్‌లో చేరింది. అదే రోజున ఆమెకు శస్త్రచికిత్స చేశారు.

2 ఎంఎం సైజు రాళ్లు ఉన్న ఆమెకు అవసరం లేకున్నా ఆపరేషన్ చేశారని, వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే అపస్మారక స్థితికి చేరుకున్నదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆమెను బ్రెయిన్ డెడ్‌కు గురైందని చెప్తున్నారని హాస్పిటల్ ఎదుట ఆదోళనకు దిగారు. పెద్ద ఎత్తున న్యాయవాదులు తరలివచ్చి సదరు డాక్టర్లను వెంటనే అరెస్టు చేయాలని, హాస్పిటల్‌ను సీజ్ చేయాలని నినాదాలు చేశారు.

ఐశ్వర్య చికిత్స కోసం ఇప్పటి వరకు రూ.7 లక్షలు ఖర్చు చేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గోపాలపురం, మార్కెట్, తుకారాం గేట్, హాస్పిటల్ వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించి బంధువులకు నచ్చజెప్పారు.ఐశ్వర్య ఆరోగ్య పరిస్థితిపై సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.

కడుపునొప్పితో అక్టోబర్ 7న హాస్పిటల్‌లో చేరిన టీ ఐశ్వర్య (28)కు కిడ్నీ నుంచి మూత్రం ప్రవహించే మార్గంలో అడ్డంకిగా ఉన్న రాయిని ఆపరేషన్ ద్వారా తొలగించాం. రక్తంలో ప్లేట్‌లెట్లు, తెల్ల రక్తకణాల సంఖ్య గణనీయంగా తగ్గడంతో శరీరంలో వాపు రావడంతో ఎంఐసీయూకు తరలించి చికిత్స అందించాం. సీటీ స్కాన్‌లో మెదడులో రక్త స్రావమైనట్టు గుర్తించాం. ప్లేట్‌లెట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో మందులతో చికిత్స అందించాం' అని పేర్కొన్నది.

www.mahanadumedia.com
జనం గుండె చప్పుడు
మహానాడు ®
Mahanaadu Media
3
డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం అక్టోబర్ 15, 2026

# నాణ్యతా ప్రమాణాల్లో టీజీఎస్పీడీసీఎల్ సరికొత్త మైలురాయి

**- నాలుగు అంతర్జాతీయ నాణ్యతా గుర్తింపులు.. విద్యుత్ పంపిణీ రంగంలో మరో ముందడుగు**

**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా గుర్తింపులు స్వీకరించిన సీఎండీ జితేష్ పాటిల్**

హైదరాబాద్: విద్యుత్ పంపిణీ రంగంలో నాణ్యతా ప్రమాణాల అమలు, సమాచార భద్రత, స్టోర్స్ నిర్వహణ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ) మరో కీలక మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా సంస్థకు నాలుగు నాణ్యతా గుర్తింపులు లభించాయి.

నాణ్యతా నిర్వహణకు సంబంధించి ISO 9001, సమాచార భద్రతకు ISO 27001, స్టోర్స్ నిర్వహణలో జపనీస్ 5ఎ విధానం, వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నందుకు క్వాలిటీ మార్క్ గుర్తింపులు దక్కాయి. సంస్థలో నిర్వహణ సామర్థ్యం, సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలకు ఈ గుర్తింపులు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఐఏఎస్ ఈ నాలుగు గుర్తింపులను స్వీకరించారు.

ISO ఆడిటర్ శివయ్య సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్. నర్సింహులు, కంపెనీ సెక్రటరీ అనిల్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ (రూరల్) బాలస్వామి



తదితర అధికారులు పాల్గొన్నారు.

**నాణ్యతా నిర్వహణకు ISO 9001**

సంస్థలోని కార్యాలయాలు, వివిధ విభాగాల్లో నాణ్యతా నిర్వహణ విధానాలను సమర్థంగా అమలు చేయడం, రికార్డుల నిర్వహణ, అంతర్గత నియంత్రణ, పర్యవేక్షణ, కార్యాచరణ ప్రక్రియలను మెరుగుపరచడం, నిరంతర అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలకు సంబంధించి ISO 9001 గుర్తింపు లభించింది.

నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా విధులను నిర్వహిస్తూ, సేవల నాణ్యతను ఎప్పటికప్పుడు మెరుగుపరచడానికి ఈ ప్రమాణం దోహదపడుతుంది. సంస్థలో జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన నిర్వహణ విధానాలకు ఇది ప్రాధాన్యతనిస్తుంది.



# విజయవాడకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**ఘన స్వాగతం పలికిన గవర్నర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు**

గన్నవరం, మహానాడు: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం సాయంత్రం 6.10 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్రపతికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు ఘన స్వాగతం పలికారు.

రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు తదితరులు ఉన్నారు.

అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భద్రతా బలగాల నడుమ ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గం ద్వారా విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

# చంచల్‌గూడ "డోర్ స్టెప్" విచారణ

**- ఫస్ట్ టైమ్ ఈ ఫెసిలిటీ**

**- లక్కీ లిక్కర్ ట్రాన్స్పోర్ట్ స్కామర్ పిల్ల కారుమూరికి!**

తండ్రి గారు కస్టడీ గెస్ట్‌హౌస్ టూర్లు ముగించుకుని మళ్లీ జైలు గదికి చేరితే, ఇప్పుడు అసలు మాస్టర్ మైండ్ అయిన కొడుకు గారి వంతు వచ్చింది! ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో ఏసీబీ కోర్టు తాజాగా జైల్లో ఉన్న కారుమూరి సునీల్‌కుమార్‌ను రెండు రోజుల పాటు సిట్ కస్టడీకి అప్పగించింది. చంచల్‌గూడ జైలు గోడల మధ్యే సునీల్‌ను సిట్ అధికారులు ప్రశ్నిస్తుండటంతో, ఇప్పుడు జైలు కాస్తా "మద్యం రవాణా మేనేజ్‌మెంట్ స్టడీ సర్కిల్" లా మారిపోయింది.

లిక్కర్ రవాణా టెండర్లలో నిబంధనలను తుంగలో తొక్కి, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన వందలాది కోట్ల ఆదాయాన్ని నేరుగా తమ కుటుంబ ఖాతాల వైపు మళ్లించడంలో సునీల్ గారు చూపిన ప్రతిభ అసాధారణం.

బాక్సులు తక్కువ, బిల్లులు ఎక్కువ అనే లెక్కల మాయాజాలం కేవలం మాయల ఫకీరు కథల్లోనే చూశాం, కానీ ఇక్కడ వాస్తవంగా అమలు చేసి చూపించారు!

తండ్రిని ఐదు రోజుల పాటు అడిగి అలసిపోయిన సిట్ అధికారులు, ఇప్పుడు కొడుకును కూడా అదే జైలులో విచారిస్తుండటంతో అక్కడ నిజంగానే 'ఫాదర్ అండ్ సన్' జాయింట్ వెంచర్ అకౌంట్స్ బయటపడబోతున్నాయి.

"అన్నీ నాన్నే చూసుకున్నారు" అని ఒకరు, "అంతా కొడుకు కనుసన్నల్లోనే జరిగింది" అని మరొకరు పరస్పరం ఇచ్చుకుంటున్న స్టేట్‌మెంట్లు చూస్తుంటే కుటుంబ ఐక్యతకు అసలైన అర్థం ఇదేననిపిస్తుంది.

ఐదు రోజులు కావాలని సిట్ కోరితే, కోర్టు రెండు రోజులు మాత్రమే పర్మిషన్ ఇచ్చినా... ఈ రెండు రోజుల్లోనే సునీల్ నుంచి రవాణా అక్రమాల




రహస్యాలు కక్కించడానికి అధికారులు సిద్ధం అయ్యారు.

లిక్కర్ బాటిళ్లను దుకాణాలకు చేరవేయడంలో ఎంత వేగంగా ఉండేవాళ్లో, ఇప్పుడు ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలోనూ అదే స్పీడ్ చూపిస్తే బావుంటుంది.

మొత్తానికి, వైకాపా హయాంలో జే బ్రాండ్స్ తో కిక్ ఇచ్చిన ఈ మాస్టర్ మైండ్‌లు, ఇప్పుడు చంచల్‌గూడ జైలులో సిట్, ఈడీ ప్రశ్నలతో పడుతున్న పాట్లు చూస్తుంటే... కర్మ ఎవరినీ వదలదు అనడానికి ఇదే నిదర్శనం. తండ్రీకొడుకులిద్దరూ జైలు కేంద్రంగా పాలిటిక్స్ మరియు బిజినెస్ పాఠాలు నేర్చుకుంటుంటే, ప్రజలు మాత్రం ఈ "ఫ్యామిలీ ప్యాకేజీ" తంతును ఆసక్తిగా చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు!

**- చాకిరేవు**

# స్కంద మాత

నవరాత్రులలో శ్రీశైలంలో నవదుర్గలకి పూజ చేస్తారు. అదే సమయంలో విజయవాడలో అమ్మవారికి ప్రతిరోజు ఒక్కొక్క అవతారంలో అలంకరణలు చేసి పూజిస్తారు.. ఇక్కడ నవదుర్గలను ఎందుకు పూజించరు? రెండు క్షేత్రాల మధ్య తేడా ఎందుకు వచ్చింది? అన్న సందేహము వస్తుంది ఎవ్వరికైనా.

దీనికి కారణం దేవాలయాల నిర్మాణ సమయంలో శిల్ప మరియు పూజా విధానాలు (కాశ్మీర, కేరళ, శైవ, లేదా శాక్తేయ ఆగమాలు) వేర్వేరుగా ఉంటాయి. కొన్ని క్షేత్రాలు విగ్రహారాధనకు (పరివార దేవతలుగా నవదుర్గలు) ప్రాధాన్యమిస్తే, మరికొన్ని క్షేత్రాలు (విజయవాడ వంటివి) ఆలంకారిక శక్తి ఉపాసనకు ప్రాధాన్యమిస్తాయి.

శ్రీశైలంలో నవదుర్గల రూపాలను వేర్వేరు విగ్రహాల ద్వారా అర్చిస్తే, విజయవాడలో ఆ నవదుర్గల శక్తులన్నింటినీ ఒకే కనకదుర్గమ్మ రూపంలో భావించి, రోజూ ఒక్కో అలంకరణ ద్వారా భక్తులకు కనువిందు చేసే సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు.

రెండు విధానాలూ దేవీ ఉపాసనలో అత్యంత ప్రాముఖ్యమైనవే. నవరాత్రులలో ఐదవ రోజు మాతృ ప్రేమను కీర్తించడానికి మరియు కొనియాడటానికి కేటాయించబడింది. ఈ రోజున మనం దేవతల సైన్యాధిపతి అయిన కార్తికేయుని తల్లి అయిన స్కందమాతను పూజిస్తాము.

స్కంద అనేది కార్తికేయునికి మరొక పేరు, మాత అంటే తల్లి; అందువల్ల ఆమెకు స్కందమాత అనే పేరు వచ్చింది. దక్షిణభారతదేశంలో కుమారస్వామి ఆరాధనకి ప్రాముఖ్యత ఎక్కువ. ఇటు శక్తినీ, అటు ముక్తినీ ప్రసాదించగల ఆ సుబ్రహ్మణ్యేశ్వరుడంటే మనకి భక్తి మెండు. మరి అలాంటి కుమారస్వామిని తల్లితో సహా ఆరాధించే సందర్భం వస్తే... ఇంకెంత ఫలదాయకమో కదా! అలాంటి అవకాశాన్ని అందించే తల్లి–స్కందమాత. ఒక చేయి అభయముద్రలో ఉండగా, ఒడిలో బాలస్కందుడిని కూర్చోబెట్టుకుని అమ్మవారు దర్శనమిస్తారు.

అమ్మవారు తెల్లని కాంతితో ప్రకాశిస్తూ, కమలంపై కూర్చుని దర్శనమిస్తారు. అందుకే ఆమెను పద్మాసన దేవి అని కూడా పిలుస్తారు. సింహం ఆమె వాహనం. ఈ అమ్మవారు మోక్ష, శక్తి, ఐశ్వర్య ప్రదాయినిగా భక్తులు నమ్ముతారు. స్కందమాత రూపంలోని మరో ప్రత్యేకత.. తల్లితనంలో ఉండే కరుణతో పాటు అవసరమైనప్పుడు పోరాడే శక్తి కూడా ఉండటం. ఒక తల్లి తన బిడ్డను కాపాడేందుకు ఎంతటి పరిస్థితినైనా ఎదుర్కొంటుందో.. అదే భావనను ఈ రూపంతో అనుసంధానిస్తారు.

నవరాత్రుల ఐదో రోజు తల్లులు తమ పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు, విద్య, శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. కుటుంబంలో ప్రేమ, అనుబంధం, ఐక్యత పెరగాలని కోరుకుంటారు. స్కందమాతను పూజించడం అంటే కేవలం సంతానం కోసం ప్రార్థించడం మాత్రమే కాదు. ప్రతి మనిషిలోని తల్లితనం, కరుణ, బాధ్యత అనే విలువలను గుర్తు



చేసుకోవడం కూడా అని భక్తి సంప్రదాయంలో భావిస్తారు. నవరాత్రుల్లో తొలి నాలుగు రోజుల తర్వాత ఐదో రోజున వచ్చే స్కందమాత రూపం అమ్మవారి శక్తికి మరో కోణాన్ని పరిచయం చేస్తుంది.

శక్తి కేవలం యుద్ధంలోనే కాదు.. ప్రేమలో, రక్షణలో, త్యాగంలో కూడా ఉంటుందని ఈ రూపం సూచిస్తుంది. ఇక శరన్నవరాత్రి మహోత్సవాలలో ఐదవ రోజున (ఆశ్వయుజ శుద్ధ పంచమి) శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తారు. ఈ దివ్య అలంకారం వెనుక ఉన్న ఆధ్యాత్మిక పరమార్థం ఏంటంటే లలితా పరమేశ్వరి శ్రీచక్రానికి మూల అధిష్ఠాన శక్తిగా వెలుగొందుతుంది. పరమ పవిత్రమైన పంచదశాక్షరీ మహామంత్రానికి ఈ అమ్మవారే అధిదేవతగా విరాజిల్లుతూ, ఆరాధించే భక్తులను, ఉపాసకులను అనుగ్రహిస్తుంది.

సకల ఐశ్వర్యాలను ప్రసాదించే శ్రీలక్ష్మీదేవి, సమస్త విద్యాజ్ఞానాలను అనుగ్రహించే శ్రీసరస్వతీదేవి ఇరువైపులా నిలిచి వింజామరలతో సేవిస్తుండగా అమ్మవారు అత్యున్నత మహారాజ్ఞిగా కొలువై ఉంటుంది. ముఖంపై చిరు మందహాసం తొణికిసలాడుతూ, అపారమైన మాతృవాత్సల్యంతో చేతిలో చెరకుగడను ధరించి భక్తులకు దర్శనమిస్తుంది. (ఆధ్యాత్మికంగా చెరకుగడ సాధకుడి మనస్సుకు సంకేతం).

అమ్మవారు పరమేశ్వరుని తొడపై కూర్చుని (మహాకామేశ్వరాంకయై) దర్శనమిచ్చే ఈ పవిత్ర సమయంలో, సాక్షాత్తూ పరమేశ్వరుడు 'మహాకామేశ్వరుడు'గాను, శ్రీ అమ్మవారు 'మహా త్రిపుర సుందరీ దేవి'గాను సమస్త పూజలు అందుకుంటారు. ఇది సృష్టి మూలమైన ప్రకృతి–పురుషుల దివ్య ఐక్యతను తెలియజేస్తుంది.

**- ములుకుట్ల సువర్చల**

# మోగిన ఎన్నికల నగారా..

**ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల**

అమరావతి, మహానాడు:

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. 100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కాగా, 10 పంచాయతీలు, 77 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 28న మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి, 30న ఫలితాలు ప్రకటించనున్నారు. నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనుండగా, 5న ఫలితాలు వెల్లడించనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 26న తొలి దశ, నవంబర్ 29న రెండో దశ, డిసెంబర్ 2న మూడో దశ ఎన్నికలు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలను పోలింగ్ రోజే ప్రకటించనున్నారు.

**పురపాలక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల పరిమితి ఖరారు**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల గరిష్ఠ వ్యయ పరిమితులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నోటిఫికేషన్ జారీ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-ZAతో పాటు వివిధ పురపాలక చట్టాల నిబంధనల ప్రకారం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్లను సవరిస్తూ కొత్త పరిమితులను నిర్ణయించారు. వీటి ప్రకారం గ్రేటర్ విశాఖపట్నం



మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి గరిష్ఠంగా రూ.40 లక్షలు, వార్డు సభ్యుడు (కార్పొరేటర్) రూ.15 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులకు రూ.25 లక్షలు, కార్పొరేటర్లకు రూ.10 లక్షల పరిమితి విధించారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ అభ్యర్థి రూ.20 లక్షలు, వార్డు సభ్యుడు (కౌన్సిలర్) రూ.7.50 లక్షల వరకు ఖర్చు చేయవచ్చు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ అభ్యర్థికి రూ.10 లక్షలు, వార్డు సభ్యుడికి రూ.5 లక్షలుగా గరిష్ఠ వ్యయ పరిమితిని నిర్ణయించారు. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

# ఆయన బల్మూరి వెంకట్ కాదు ఇచ్ గార్డు వెంకట్

**- కుంభకోణాలకు అడ్డగా గాంధీ భవన్**

**- కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి**

హైదరాబాద్: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేశారు. ఆయన బల్మూరి వెంకట్ కాదు ఇచ్ గార్డు వెంకట్. బల్మూరి వెంకట్ గాలి మాటలు మాట్లాడుతున్నాడు. విప్ గా ప్రజలకు మంచి పనులు చేయాల్సింది పోయి ఎంతసేపు విమర్శించడమే సరిపోతుంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ ఆసుపత్రి మెడికవర్ ఆసుపత్రి. మెడికవర్ ఆసుపత్రిలో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. మెడికవర్ ఆసుపత్రి వద్ద వందల సంఖ్యలో పోలీసులు ఉంటున్నారు. పసలేని అర్థంలేని ఆరోపణలు కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారు. సినిమా ప్రమోషన్ కోసం ఎక్కడైనా పెట్టుకుంటారు.

సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేశారు. కొండా సురేఖ , చిన్నా రెడ్డి, యాడ్ ఏజెన్సీ మహిళను బంధించింది ఎవరు.? కుంభకోణాలకు అడ్డగా గాంధీ భవన్ మారింది.

కాంగ్రెస్ కాదు స్కాంగ్రెస్ గా మారిపోయింది.. కాంగ్రెస్ అవినీతి పై దేశ ప్రధాని మోడీనే చెప్పిండు..రాష్ట్రంలో =ఆ= ట్యాక్స్ వసూల్ చేస్తున్నారని. మంత్రులు 30 శాతం కమిషన్ లు తీసుకుంటున్నారు. మంత్రుల కమిషన్ ల పై పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. బల్మూరి వెంకట్ దొర అహంకారంతో వ్యాహరిస్తున్నాడు.

దళిత ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడును వేధించాడు. మా నాయకుల పై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే బల్మురి వెంకట్ నాలుక కోస్తాం. గాడిద దొంగతనం చేసిన వ్యక్తి బల్మూరి వెంకట్. వెంకట్ చరిత్ర బయటపెడితే ఉరి వేసుకొని చస్తాడు.




పార్టీలో చేర్చుకోమని కేటీఆర్ కాళ్ళు మొక్కిన వ్యక్తి వెంకట్. చామల కిరణ్ కుమార్ రెడ్డికి నోటి దురుసు ఎక్కువ.అందుకే చామల కిరణ్ కుమార్ రెడ్డిని పార్టీ నుంచి పక్కకు పెట్టారు. కాంగ్రెస్ అక్రమాలు రోజుకొకటి బయటపడుతుంటే తట్టుకోలేక పోతున్నారు.

ఈరోజు బల్మూరి వెంకట్. మాట్లాడిన మాటలకు వెంటనే క్షమాపణలు చెప్పాలి. బాడీ షేమింగ్ కు కేరాఫ్ అడ్రస్ రేవంత్ రెడ్డి. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురించి మాట్లాడే నైతిక హక్కు చామల కిరణ్ కుమార్ రెడ్డికి లేదు. చామల కిరణ్ కుమార్ రెడ్డి చిట్టా మొత్తం బయటకు తీస్తాం. రాహుల్ గాంధీ సంతకాన్నే ఫోర్జరి చేసిన ఘనత చామల కిరణ్ కుమార్ రెడ్డిది. ప్రెస్ మీట్ లో బీ ఆర్ ఎస్ నేత కార్తీక్ రాయల పాల్గొన్నారు

# తెలుగులో గజల్ వికారానికి విదూషకత్వానికి వేడుకలు!

గజల్... ప్రపంచ కవితా ప్రక్రియలో ఫార్సీ నుంచి ఉద్భవించిన ప్రక్రియ గజల్.

గజల్ ద్వారా ప్రపంచంలోకి గొప్ప కవిత్వం, సాంద్రమైన కవిత్వం వచ్చింది. గ్యోతా (Goatha) అనే జర్మన్ పరిశీలకుడు కవి "హాఫీజ్ రాసిన గజళ్ల నుండి ప్రపంచంలోకి గొప్ప కవిత్వం వచ్చింది" అని విశ్వవ్యాప్తంగా తెలియజేశాడు. తొలిదశలో కవితా రూపంగానే ఉన్న గజల్ తరువాత తరువాత గానం రూపంలోనూ ప్రత్యేకతను సంతరించుకుంది.




గజల్ అన్నది రచన, గానం పరంగా ఉదాత్తమైంది. గజల్ అంటేనే సాంద్రత, బిగి, పొంకంతో ఒక విశేషమైన ప్రక్రియ. ముఖ్యంగా గజల్ గానం ఉన్నత స్థాయి సంగీతజ్ఞతతో రాజిల్లుతోంది.

గజల్ అంటూ తెలుగులో తొలి రచన చేసినవారు దాశరథి. ఈ సత్యాన్ని ఆధారాలతో చెప్పింది నేనే. నాకు ముందు ఈ విషయాన్ని ఏ తెలుగు గజల్ పరిశీలకుడు, మేధావి ఒళ్లు వంచి తెలుసుకోలేకపోయాడు.

తెలుగులో గజల్ రాసిన రెండవ వ్యక్తి పీ.బీ. శ్రీనివాస్. పీ.బీ. శ్రీనివాస్ తొలి గజల్ గాయకుడు, తొలి గజల్ వాగ్గేయకారుడు. 'గజలియత్' అంటే గజల్ తనంపై సరైన తెలివిడితో గజల్ రచన, గానం చేసిన తొలి తెలుగు కళాకారుడు పీ.బీ. శ్రీనివాస్. సినారెకు ఈ గజలియత్ అంటే ఏమిటో కూడా తెలియదు.

సీ.నారాయణరెడ్డి తెలుగులో గజల్ అంటూ రాసినవి గజళ్లు కానేకావు. ఈ విషయాన్ని నేను శాస్త్రీయంగా నిరూపించాను. నాకు ముందే బూదరాజు రాధాకృష్ణ 1987లోనే గజళ్లు అంటూ రాసిన సినారెను తూర్పారపట్టారు. గజల్ ప్రక్రియను తెలుగులో అత్యంత నాసిరకం రచన చేసేశారు సినారె. ఆ సినారె గజళ్లు అంటూ పాడారు కూడా. గజల్ గానానికి అధమ స్థితి తెలుగులో సినారెతోనే మొదలయింది. గజల్ అంటూ సినారే తన చాతకానితనంతో తెలుగును మోసం చేశారు.

సినారె వల్ల తెలుగులో గజల్ భంగం, భగ్నం అయిపోయింది. తదాదిగా గజల్ శ్రీనివాస్ చేసిన లొల్లాయి గానంతో వికారం, విదూషకత్వం కూడా అయిపోయింది. ఇవాళ గజల్ వల్ల తెలుగు భాష కూడా వికృత దోషాలతో వికారం అయింది. గజల్ తెలుగుకు గాయం, శాపం అయిపోయింది.

గజల్ గానం అన్నది తెలుగులో మాత్రమే ఒక లొల్లాయి డబ్బా గానం అయిపోయింది. తెలుగు జాతికే కళంకం గజల్ అన్నది. గజల్ రచన పరంగా నాసిరకం అవడం సినాలె వల్ల అయితే గానం వల్ల లొల్లాయి పాట అయిపోయింది గజల్ శ్రీనివాస్ వల్ల.

ఆ గజల్ శ్రీనివాస్ తాను 40 వసంతాల గజల్ గాన వేడుకలు అని జరుపుకున్నారు! హతవిధీ ఇది వికారం ఇది విదూషకత్వం. గజల్ గానం ఛాయలు కూడా లేని ఆ గజల్ శ్రీనివాస్ తన 40యేళ్ల గజల్ గాన వేడుకలు అనడం గర్హనీయం. తెలుగు భాషకే అవమానం; కళంకం.

గజల్ శ్రీనివాస్ తన డబ్బులతో తన '40 వసంతాల గజల్ గాన వేడుకలు' అని చేసుకోవడం ఎంత వికారం? ఎంతో వికారం. ఇవి గజల్ గాన వేడుకలు కావు ఇవి తెలుగులో గజల్ వికారానికి విదూషకత్వానికి వేడుకలు!

ప్రతి తెలుగు భాషాభిమాని ఇలాంటి వికృతాన్ని గర్హించాలి. ఈ గజల్ వికార విదూషకత్వానికి వేడుకలు గుంటూరులో 14 అక్టోబరున జరిగాయి. గుంటూరు దౌర్భాగ్యం మాత్రమే కాదు తెలుగు జాతి దౌర్భాగ్యం ఈ వేడుకలు.



**- రోచిష్మాన్**
**9444012279**

# రజత్ భార్గవకు ఈడీ నోటీసు

మద్యం కుంభకోణం కేసులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నమోదైన కేసులో భాగంగా, హైదరాబాద్‌లోని తమ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రజత్ భార్గవ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో రూపొందించిన నూతన మద్యం విధానం, మద్యం బ్రాండ్ల ఆమోదం, కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది.

ఈ కేసులో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం రజత్ భార్గవను పలుమార్లు విచారించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. సిట్ విచారణలో భాగంగా, నాటి సీఎంవో నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే మద్యం విధానంలో అక్రమాలు జరిగాయని, బేస్ ధరల పెంపును తాను వ్యతిరేకించినా పట్టించుకోలేదని భార్గవ వాంగ్మూలం ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి.



www.mahanadumedia.com

జనం గుండె చప్పుడు

# మహానాడు ®

Mahanaadu Media

4

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం అక్టోబర్ 15, 2026







# డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా

- భూ కబ్జాలపై ఫిర్యాదులు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావినతుల స్వీకరణ

**మంగళగిరి, మహానాడు:** టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. డ్వాక్రా సంఘాల పొదుపు సొమ్ము దుర్వినియోగం, పిత్రార్జిత భూముల ఆక్రమణ, ఇంటి స్థలాల కబ్జా యత్నాలు, నకిలీ ప్రామిసరీ నోట్లతో బెదిరింపులు, నగదు వసూలు, వ్యాపార నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు తదితర సమస్యలను బాధితులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అర్జీలను స్వీకరించిన ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తత్తయ్య బాబు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

గుంటూరుకు చెందిన షేక్ హసీనా, కోనేటి సుభాషిణి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నగరంలోని శ్రీనివాసరావుపేట పరిధిలోని 25 డ్వాక్రా సంఘాలకు షేక్ గౌసియా బేగం రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సంఘాల నుంచి ప్రతి నెలా వసూలు చేసిన పొదుపు మొత్తాలను బ్యాంకుల్లో జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగించుకున్నారని ఆరోపించారు. బిస్మిల్లా డ్వాక్రా గ్రూపునకు చెందిన రూ.3,53,000 పొదుపు మొత్తాన్ని బ్యాంకులో జమ చేయకుండా దారి మళ్లించారని పేర్కొన్నారు. స్థానిక నాయకులు, కమ్యూనిటీ ఆర్గనైజర్ అండతో మరికొందరిని కూడా అధిక వడ్డీ ఆశ చూపి మోసం చేశారని ఆరోపించారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని తమ సొమ్ము తిరిగి ఇప్పించాలని కోరారు.

వైఎస్ఆర్ జిల్లా వీఎన్ పల్లె మండలం కదిరేపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ తన పిత్రార్జిత భూమిని అక్రమంగా కాజేశారని ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 18/5లో తమకు 5.48 ఎకరాల భూమి ఉందని, అందులో 4.22 ఎకరాలను పాలెం శ్రీదేవి, భీం సునీల్ కుమార్ తప్పుడు పత్రాలు సృష్టించి తమ పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం తన పేరుపై కేవలం 1.26 ఎకరాలు మాత్రమే మిగిలాయని తెలిపారు.

అనంతపురానికి చెందిన వెంకటమ్మ తన ఇంటి నిర్మాణ పనులకు పక్కింటి వ్యక్తి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇంటికి సంబంధించిన అన్ని అనుమతులు, పత్రాలు ఉన్నప్పటికీ నాగభూషణం అనే వ్యక్తి ప్లాస్టరింగ్ పనులు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారని, ఇల్లు కడితే గోడలు కూల్చేస్తానంటూ బెదిరిస్తున్నారని తెలిపారు.

గుంటూరుకు చెందిన కోనేటి కబ్బయ్య తన వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో మోసానికి గురయ్యామని ఫిర్యాదు చేశారు. గుంటూరు కూరగాయల మార్కెట్‌లో 25 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. ఏడాది క్రితం చింతకాయల రామారావు మార్కెట్ ధర కంటే అధిక మొత్తానికి తమకు స్థలం విక్రయించారని, దీనిపై ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి దిగారని ఆరోపించారు. సుమారు ఎనిమిది నెలల క్రితం వ్యాపార అవసరాల కోసం రామారావు, ఆయన భార్య నాగమల్లేశ్వరి వద్ద రూ.5 వడ్డీకి రూ.లక్ష అప్పుగా తీసుకున్నామని, అప్పట్లో ఒంగోలు శ్రీనివాసరావు పేరుతో ఉన్న నోటుపై సంతకాలు చేయించుకున్నారని తెలిపారు.

తిరుపతి జిల్లా పాకాల మండలం గుండ్లగుట్టపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ తన ఇంటిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నానని అర్జీ ఇచ్చారు. 2006లో ప్రభుత్వం తనకు 2.5 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసిందని, అందులో సొంత కష్టంతో చిన్న ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్నానని తెలిపారు. ఇంటికి క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నానని, విద్యుత్ కనెక్షన్ కూడా తన పేరుతోనే ఉందని పేర్కొన్నారు. ఇటీవల తన పెద్ద కుమారుడు మరణించడంతో పెద్ద కోడలు జే. బంగారమ్మ, మనవళ్లు జే. అశోక్, గోపి, చెంగల్రాయులు మరికొందరితో కలిసి తనపై దౌర్జన్యం చేసి ఇంటి నుంచి బలవంతంగా బయటకు గెంటేశారని ఆరోపించారు.

కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన ఆర్. మాధవప్ప తన హోటల్ నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డోన్ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన సొంతంగా 'న్యూ భారత్ హోటల్' ఏర్పాటు చేసుకుని గత 30 ఏళ్లుగా నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ హోటల్ ద్వారా 30 నుంచి 35 ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాత్రివేళ ప్రయాణించే ప్రైవేటు బస్సులు, లారీలు, కార్ల ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని, పోలీసుల సూచనల మేరకు సీసీ కెమెరాలు, ప్రైవేటు భద్రతా సిబ్బందిని కూడా ఏర్పాటు చేశామని వివరించారు. అయినప్పటికీ పోలీసులు ప్రతిరోజూ రాత్రి 11 గంటలకే వచ్చి హోటల్‌కు పరదాలు కట్టి బలవంతంగా మూసివేయిస్తున్నారని ఆరోపించారు.

శ్రీకాకుళం జిల్లా నర్సయ్యపేట గ్రామానికి చెందిన మైలపల్లి నర్సింగరావు తనకు కేటాయించిన భూమికి పట్టా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సొంత భూములు లేకపోవడంతో 2016లో శ్రీకాకుళం పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో కలిసి తన పేదరికాన్ని వివరించినట్లు తెలిపారు. తన పరిస్థితిని అర్థం చేసుకున్న అప్పటి ముఖ్యమంత్రి నర్సయ్యపేట ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో 35 సెంట్లు కేటాయించాలని ఆదేశించారని పేర్కొన్నారు.

వీటితో పాటు పలువురు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు సమర్పించారు. మరికొందరు ఉద్యోగాల కోసం తమ వివరాలతో కూడిన దరఖాస్తులు అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# యువతకు కొలువుల జాతర!

150 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ

24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు

టీడీపీ సీనియర్ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ



**అమరావతి, మహానాడు:** ఇచ్చిన మాటకు నిలువెత్తు సాక్ష్యంగా కూటమి ప్రభుత్వం కొలువుల జాతర నిర్వహిస్తోందని టీడీపీ సీనియర్ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ప్రక్షాళనతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఒక్క ఉద్యోగ క్యాలెండర్ లేదా డీఎస్సీ కూడా ప్రకటించకుండా యువత భవిష్యత్తును దెబ్బతీశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా భర్తీ చేసి నిరుద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు.

యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్ నిరుద్యోగుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం అంతకుమించి 24 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వర్మ పేర్కొన్నారు. గత 26 నెలల్లో పారిశ్రామిక అనుకూల విధానాలతో గూగుల్, గ్రీన్‌కో వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి సుమారు రూ.29 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చారని తెలిపారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోనసీమ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఇంటి నుంచి పనిచేసే విధానం ద్వారా ఇప్పటికే 5,500 మందికి ఉపాధి అవకాశాలు లభించాయని, సెమీకండక్టర్లు, ఐటీ రంగాల్లో మరిన్ని ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు లోకేష్ విదేశీ పర్యటనలు చేస్తుంటే విమర్శలు చేసే ప్రతిపక్షాలకు కనీస అవగాహన లేదని దుయ్యబట్టారు.

రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడం, యువతకు ఉపాధి కల్పించడం ద్వారా కూటమి ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని వర్మ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి సుపరిపాలన మరో 15 ఏళ్ల పాటు నిరంతరాయంగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర యువతను అత్యుత్తమ ప్రతిభావంతులుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రభుత్వ బడులకు మహర్దశ

- విద్యారంగంలో సమూల మార్పులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలల ఆధునీకరణ
- ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ డా. జెడ్. శివప్రసాద్



**మంగళగిరి, మహానాడు:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతున్నాయని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ డా. జెడ్. శివప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తూ, పేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు.

బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివప్రసాద్ మాట్లాడారు. ఉపాధ్యాయులపై ఉన్న అనవసర బోధనేతర పనుల భారాన్ని తగ్గించి, వారు విద్యార్థులకు బోధించేందుకు పూర్తి సమయం కేటాయించేలా ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పించిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను అంతర్జాతీయ విద్యావిధానాల అధ్యయనం కోసం సింగపూర్‌కు పంపుతున్నామని తెలిపారు.

గత వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక వేధింపులకు గురయ్యారని శివప్రసాద్ విమర్శించారు. తల్లిదండ్రుల తర్వాత దైవసమానులుగా భావించే గురువులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టించడం, మరుగుదొడ్లు శుభ్రం చేయించి ఫొటోలు తీయించడం ద్వారా వారి గౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. 2019 ఎన్నికలకు ముందు 2.30 లక్షల ఉద్యోగాలు, అందులో 23 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసగించారని విమర్శించారు.

పాఠశాలల అభివృద్ధి అంటే కేవలం రంగులు వేయడం, ప్రచారం చేసుకోవడం కాదని, బెంచీలు, ఫ్యాన్లు వంటి కనీస వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని శివప్రసాద్ అన్నారు. రద్దు చేసిన అప్రెంటిస్ విధానాన్ని తిరిగి తీసుకొచ్చి ఉద్యోగుల జీతాల్లో కోతలు పెట్టారని విమర్శించారు. హక్కుల కోసం బీఆర్‌టీఎస్ రోడ్డులో శాంతియుతంగా ఆందోళన చేసిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించి హింసించారని ఆరోపించారు.

ప్రస్తుతం కూటమి పాలనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలలు కళకళలాడుతున్నాయని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయని శివప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ విద్యారంగం స్వర్ణాంధ్ర దిశగా ప్రగతి సాధిస్తోందని డా. జెడ్. శివప్రసాద్ పేర్కొన్నారు.

# 150 రోజుల్లో 16,347 టీచర్ పోస్టుల భర్తీ!

రెండో డీఎస్సీతో మరో 2,721 కొలువులు

14 డీఎస్సీల ద్వారా 1.96 లక్షల మందికి ఉద్యోగాలు

- గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఎం. సుగుణమ్మ



**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో సరికొత్త చరిత్ర సృష్టిస్తోందని గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఎం. సుగుణమ్మ అన్నారు. కేవలం 156 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, మెగా డీఎస్సీ అనంతరం మరో 2,721 పోస్టుల భర్తీకి రెండో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. 1994 నుంచి 2025 వరకు 14 డీఎస్సీల ద్వారా 1,96,619 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను వివిధ పనులతో ఇబ్బందులకు గురిచేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వారికి వృత్తి నైపుణ్య శిక్షణతో పాటు గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పిస్తోందని వివరించారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుగుణమ్మ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, నాణ్యమైన విద్యను అందించడంతో పాటు నిరుద్యోగ యువతకు పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల నిరీక్షణకు తెరదించుతూ 16,347 ఉపాధ్యాయ పోస్టులను రికార్డు సమయంలో భర్తీ చేశామని తెలిపారు. మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తయిన వెంటనే మరో 2,721 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఇందులో సాధారణ పాఠశాలల్లో 2,111 పోస్టులు, దివ్యాంగ విద్యార్థుల కోసం 350 ప్రత్యేక పోస్టులు, గురుకులాల్లో 260 పోస్టులు, రెసిడెన్షియల్ సంస్థల్లో 68 పోస్టులు, మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో 15 పోస్టులు ఉన్నట్లు వివరించారు. నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ యువతకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను పునరుద్ధరించి వారి కుటుంబాలకు అండగా నిలిచామని పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులతో మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టించారని, మరుగుదొడ్లు శుభ్రం చేయించారని, వివిధ యాప్‌లు, నాడు-నేడు ఫొటోల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేశారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి పాలనలో పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని, ఉపాధ్యాయులు గౌరవప్రదంగా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి యువతకు నిరంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని సుగుణమ్మ స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో కూటమిదే ఏకపక్ష విజయం

- 94 శాతం స్ట్రైక్ రేట్‌తో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం
- రెండేళ్లలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నాం
- కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి.. పార్టీ శ్రేణుల్లో జోష్
- ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి బలం
- మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, మహానాడు:** జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గొడ్డలి పార్టీ పాలనలో రాష్ట్రం ఎంత అస్తవ్యస్తంగా మారిందో ప్రజలకు బాగా తెలుసని పేర్కొన్నారు. కనీసం ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకని దిక్కుతోచని స్థితిలో వైసీపీ ఉందని విమర్శించారు.

94 శాతం స్ట్రైక్ రేట్‌తో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి నెలకొందని, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, రానున్న ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి బలమని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# సరస్ మేళాతో డ్వాక్రా మహిళలకు ఊతం

కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



**విజయవాడ, మహానాడు:** గ్రామీణ ప్రాంతాల డ్వాక్రా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, వారు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే జాతీయ సరస్ ఆజీవికా మేళా ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభం కానున్న జాతీయ సరస్ ఆజీవికా మేళా-2026 ఏర్పాట్లను స్థానిక ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్)తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అత్యుత్తమ నాణ్యత కలిగిన ఆహార పదార్థాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విభిన్న ఉత్పత్తులను ఈ మేళాలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డ్వాక్రా మహిళలకు ఈ మేళాలో అత్యంత ప్రాధాన్యం కల్పించేలా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

గ్రామీణ మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి ఉత్పత్తులకు తగిన గుర్తింపు, మార్కెట్ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా విచ్చేయడం ప్రత్యేకమని అన్నారు. జాతీయ సరస్ మేళాను రాష్ట్రానికి తీసుకురావడానికి ఆసక్తి చూపిన ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక అభినందనలకు అర్హులని పేర్కొన్నారు.

# నిరుద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం

10 వేలకుపైగా ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి



**మంగళగిరి, మహానాడు:** నిరుద్యోగులకు అండగా నిలుస్తూ, ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల ఆశలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి తెలిపారు. నిరుద్యోగులకు అనుకూలమైన ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల కావాలని లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చే దిశగా ప్రస్తుత ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956లో ఏర్పడినప్పటి నుంచి దాదాపు ఏడు దశాబ్దాలుగా నిరుద్యోగులు వార్షిక ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. 2026 ఉగాది సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 10 వేలకుపైగా ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించడం సంతోషకరమన్నారు. కేవలం క్యాలెండర్ ప్రకటించడమే కాకుండా, దాన్ని ఆచరణలో అమలు చేయడం ముఖ్యమని పేర్కొన్నారు.

ఇప్పటికే మే 15న తొలి దశలో 1,500 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వివరించారు. సెప్టెంబర్ 15న గ్రూప్-1తో సహా 20 రకాల ఉద్యోగాలకు సంబంధించి మొత్తం 892 పోస్టులతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్లు జారీ చేసిందన్నారు. సెప్టెంబర్ 16న పోలీసు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా విడుదలైందని తెలిపారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను దశలవారీగా ముందుకు తీసుకెళ్తూ నిరుద్యోగుల్లో విశ్వాసాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరిధిలో సుమారు 1,500 ఉద్యోగాలకు సంబంధించి సంక్షిప్త నోటిఫికేషన్ విడుదలైందని వివరించారు. వీటిలో గ్రూప్-2, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఆఫీసర్, డైట్ లెక్చరర్లు, సీనియర్ లెక్చరర్లు, ఎస్ఈఆర్‌టీ లెక్చరర్లు, సుమారు 500 అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు 686 గ్రూప్-2 ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల ప్రక్రియను వేగవంతం చేయడం నిరుద్యోగులకు ప్రయోజనకరమని అన్నారు.

ఉద్యోగాల నోటిఫికేషన్లను దశలవారీగా విడుదల చేస్తూ నిరుద్యోగులకు భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లక్షలాది మంది నిరుద్యోగుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించిన ఉద్యోగాలకు అనుగుణంగా ఆసక్తి ఉన్న పోస్టులను ఎంపిక చేసుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. త్వరలోనే ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల్లో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. నిరుద్యోగుల ఆశలను అర్థం చేసుకుని, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి స్పష్టం చేశారు.

# వంట గ్యాస్ ఉత్పత్తులకు కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు

- పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశంలో ఎంపీ వద్దిరాజు



**ఢిల్లీ:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా దేశంలో క్రూడాయిల్, వంట గ్యాస్ ఉత్పత్తులకు కొరత తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం పార్లమెంట్ ప్రాంగణంలోని అనెక్స్ హాలులో బుధవారం సమావేశమైంది. సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఆందోళకర, ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పెట్రోలియం, డీజీల్, వంటగ్యాస్ సరఫరాలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సలహాలిచ్చారు.

# పైడితల్లి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు

**చిట్టవలస, మహానాడు:**

కోటబొమ్మాళి మండలం చిట్టవలస గ్రామంలో సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి నూతన దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర వేడుకకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తరతరాలుగా గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ వేడుకల్లో గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలను పొందారు. ఈ వేడుకలు గ్రామ ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను మరింత పెంపొందించాయి.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిని సంపతిరావు



భారతమ్మతో పాటు గ్రామ ప్రముఖులు మెట్ట సూర్యనారాయణ, కురుకుల శ్రీను, కురుకుల నారాయణరావు, మెట్ట ప్రసాదరావు, చింతాడ గౌరినాయుడు, దుంపల ముత్యాలరావు, బొడ్డేపల్లి వేణు, సంపతిరావు లోకనాథం మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# రూ.16.50 కోట్లతో అభివృద్ధి పనులు

### పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

### ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలో రూ.16.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి, భూమిపూజ నిర్వహించారు.

వినుకొండ పురపాలక సంఘం పరిధిలోని 36 వార్డుల్లో హైబ్రిడ్ యాన్యుటీ నమూనా (హెచ్ఏఎం) నిధులతో రూ.15 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పట్టణంలో రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టారు.

పట్టణంలోని మార్కాపురం రోడ్డు, నరసరావుపేట రోడ్డు, కారంపూడి రోడ్లలో రూ.1.50 కోట్లతో డివైడర్ల నిర్మాణం, మధ్యలో విద్యుత్ దీపాల



ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకుడు నాగ శ్రీను రాయల్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విజయనగరం జిల్లాకు జలకళ!

### 454 చెరువుల పునరుద్ధరణకు రూ.22.14 కోట్లు

### వందలాది గ్రామాలకు తీరనున్న సాగు, తాగునీటి కష్టాలు

### చెరువుల్లో పూడిక తొలగింపు, కాలువల పునరుద్ధరణకు చర్యలు

### జిల్లా నుంచి వచ్చిన వినతులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందన

**విజయనగరం, మహానాడు:**

విజయనగరం జిల్లాలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్యలు చేపట్టారు. జిల్లాలోని 454 చెరువుల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం రూ.22.14 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి జిల్లా నుంచి వచ్చిన వివిధ వినతులను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పనులు పూర్తయితే వందలాది గ్రామాలకు సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

2026-27 ఆర్థిక సంవత్సరానికి వీబీ-జీ రామ్ జీ పథకంలో భాగంగా జిల్లాకు రూ.205.69 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులు అందుబాటులో ఉన్నాయి. వీటిని వినియోగించుకుని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.



ఇందులో భాగంగా చెరువుల్లో పూడిక తొలగించడం, నీటి సరఫరా కాలువలను పునరుద్ధరించడం, స్లూయిస్ గేట్లకు మరమ్మతులు చేయడం వంటి పనులు చేపట్టనున్నారు.

జిల్లాలోని 454 చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా పనులను త్వరితగతిన ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంతో చెరువుల నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడటంతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలకు ఉపశమనం లభించనుంది. జిల్లా ప్రజల నుంచి వచ్చిన వినతులకు స్పందించి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ మేరకు ఆమోదం తెలిపారు.





# కుడి ఎడమైతే పొరపాటే

"కర్బన రసాయన అణువుల్లో అవి రెండూ ఒకేలా కనిపిస్తాయి. కానీ, ఒకటి ఉపయోగపడితే.. ఇంకొకటి నిరుపయోగంగా మారే అవకాశాలే ఎక్కువ." ఇది మన శరీరంలోనే జరిగే అద్భుతమైన కెమిస్ట్రీ.. మన రెండు చేతులను ఒకసారి గమనిస్తే.. ఎడమ మరియు కుడి చేతులు రెండింట్లో ఐదు వేళ్లే.. ఆకారం కూడా దాదాపు ఒకటే.. కానీ ఎడమ చేతిని అద్దంలో చూస్తే కనిపించే ప్రతిబింబం కుడి చేయిలా ఉంటుంది.

ఇలాంటి బింబ ప్రతిబింబ జతలు కొన్ని రసాయన అణువుల్లో కూడా ఉంటాయి.. వాటినే రసాయన శాస్త్రంలో అసౌష్టవ అణువులు (కైరల్ మాలిక్యూల్స్) అంటారు.. ఆ రెండింటి ఆధ్యారోపితం కాని బింబ ప్రతిబింబ రూపాలను (నాన్ సూపర్ ఇంపాజిబుల్ మిరర్-ఇమేజ్ ఫామ్స్) ను ఎనాన్షియోమర్లు అంటారు.

దృశ్య సాదృశ్యాల (ఆప్టికల్ ఐసోమర్స్) మీద సాధారణ పరిశోధన చేసినందుకు మరియు ఒకే రకమైన ప్రతిబింబ అణువు ( మిర్రర్ ఇమేజ్ మాలిక్యూల్) ఎక్కువగా ఎలా తయారవుతుందో, అవసరం లేని అణువును రసాయన చర్యల ద్వారా ఎలా నియంత్రించాలన్న గుట్టువిప్పినందుకు గాను శాస్త్రవేత్తలు హెన్రీ బి. కాగన్, కెన్సో సోయి లు 2026 నోబెల్ పురస్కారం అందుకున్నారు.

ఇక్కడే అసలు ట్విస్ట్. మన శరీరం ఈ రెండు అణువులను ఒకేలా చూడదు.. ఎందుకంటే మన శరీరంలోని ప్రోటీన్లు, ఎంజైములు, డీఎన్ఏ.. ఇలా అన్నింటికి ఒక నిర్దిష్టమైన అణు ఆకృతి (మాలిక్యులర్ షేప్) ఉంటుంది. అందుకే ఒక అణువు మన శరీరంలో సరైన తాళానికి సరిపోయే తాళం చెవిలా పనిచేస్తే.. దాని ప్రతిబింబం మాత్రం సరిగ్గా సరిపోకపోవచ్చు.. ప్రాదేశిక సాదృశ్యాల్లో (జామెట్రికల్ ఐసోమర్స్) కూడా దీనికి కొన్ని ఉదాహరణలు ఉన్నాయి.

సీఐఎస్-ప్లాటిన్ మరియు ట్రాన్స్ - ప్లాటిన్ లలో సిస్ - ప్లాటిన్ కేన్సర్ ను నివారించే ఒక ముఖ్యమైన మందుగా గా పనిచేస్తుంది. కానీ.. సిస్ ప్లాటిన్ లాగే క్ర, చీఎ3, జశ్రీ2 లతోనే తయారైన ట్రాన్స్- ప్లాటిన్ మాత్రం కేవలం దాని జ్యామితి (జామెట్రీ) మారడం వల్ల డీఎన్ఏతో ఏర్పడే పరస్పర చర్యలు సిస్-ప్లాటిన్ లాగా ఉండవు.. అందుకే సిస్-ప్లాటిన్ తో పోలిస్తే ఇందులో యాంటి కాన్సర్ యాక్టివిటీ చాలా తక్కువగా ఉంటుంది.

. దీన్ని బట్టి అణువులకు కూడా మన లాగే ఎడమ మరియు కుడి చేతులుంటాయని అర్థం చేసుకోవచ్చు.. ఇదే వందేళ్లకు పైగా శాస్త్రవేత్తలను వెంటాడిన రసాయన శాస్త్ర రహస్యం - ఏక హస్తాణు ధర్మ రహస్యం (హోమోకైరాలిటీ మిస్టరీ). ఈ రహస్యాన్ని ఛేదించే దిశలో ఈ ఇద్దరు శాస్త్రవేత్తలు అద్భుతమైన పరిశోధన చేశారు.. అందుకే వీరిద్దరికి 2026 కెమిస్ట్రీ నోబెల్ బహుమతి దక్కింది.

ఒక రసాయన చర్యలో రెండు బింబ ప్రతిబింబ రూపాలు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు.. ఒక రూపాన్ని మరొక దానికంటే ఎక్కువగా తయారు చేయడానికి చర్యను ఎలా నియంత్రించాలో కాగాన్ చూపించారు.. అంటే.. "రెండూ రావచ్చు.. కానీ నాకు కావాల్సింది ఈ ఒక్క రూపమే" అని రసాయన శాస్త్రానికి చెప్పే మార్గాన్ని ఆయన అభివృద్ధి చేశారు.. ఈయన పరిశోధనలో ముఖ్యమైన అంశం అనుపాతంలో లేని ప్రభావం ( నాన్-లీనియర్ ఎఫెక్ట్). మొదట చిన్న అణు అసమతుల్యత (మాలిక్యులర్ ఇంబాలెన్స్) ఉంటే.. చర్యలో అది ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా పెరగవచ్చని ఆయన చూపించారు.

ఇక జపాన్ శాస్త్రవేత్త కెన్సో సోయి ఇంకా ఆశ్చర్యకరమైన విషయాన్ని కనుగొన్నారు. ఒక రసాయన చర్యలో ఏర్పడిన అసౌష్టవ అణువు.. అదే చర్యను మళ్లీ ముందుకు నడిపించడంలో ఉత్ప్రేరకంగా పనిచేస్తే..? అంటే.. తానే తయారై.. తనలాంటి మరిన్ని అణువులు తయారయ్యేలా చర్యను ప్రోత్సహిస్తే? దీనినే స్వయం ఉత్ప్రేరణ చర్య 'ఆటోక్యాటలిసిస్' అంటారు. సోయి చేసిన ప్రసిద్ధ పరిశోధనల్లో ఈ అద్భుతమైన స్వీయ - బలవర్ధక ప్రవర్తన (సెల్ఫ్- యాంప్లిఫైయింగ్ బిహేవియర్) కనిపించింది.. ఒక చిన్న అణు ప్రాధాన్యత, చర్య కొనసాగుతున్న కొద్దీ మరింత పెద్దగా మారుతుంది.

దీనిని సోయి చర్యగా రసాయన శాస్త్రంలో గుర్తిస్తారు. అయితే ఈ పరిశోధన మనకు ఎందుకు అంత ముఖ్యమైనది అంటే ఔషధాల తయారీలో అణు ఆకృతి చాలా ముఖ్యమైనది.. ఒక ఔషధాణువు మన శరీరంలోని నిర్దిష్ట ప్రోటీన్ కి సరిగ్గా సరిపోవాలి.. ఆ అణువు యొక్క ప్రతిబింబ రూపం, అదే విధంగా పనిచేస్తుందని అనుకోవడం సరికాదు. అందుకే ఔషధ రసాయన శాస్త్రం (ఫార్మాసిటికల్ కెమిస్ట్రీ) లో మనకు కావాల్సిన ప్రతిబింబ రూపాన్ని ఎక్కువగా ఎలా తయారు చేయాలి అనేది చాలా ముఖ్యం.

కాగన్, సోయి పరిశోధనలు ఈ అసౌష్టవ సేంద్రీయ సంశ్లేషణ (అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్) రంగానికి కొత్త దిశను చూపాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. అణువులకి కూడా ఎడమ, కుడి చేతులు ఉంటాయని తెలుసుకోవడమే కాదు.. రసాయన చర్యలనుపయోగించి మనకు కావాల్సిన చేతినే ఎక్కువగా ఎలా తయారు చేయాలో చూపించినందుకు హెన్రీ కాగన్, కెన్సో సోయిలకు.. రసాయన శాస్త్ర విభాగం 2026 లో నోబెల్ బహుమతి వచ్చింది..

ఇదే విజ్ఞానం యొక్క అందం.. మన కంటికి కనిపించని ఒక చిన్న అణువులోని ఒక చిన్న ప్రతిబింబం.. ప్రపంచంలోని ఔషధాలు, జీవ మరియు రసాయన శాస్త్రాల గురించి మనకున్న అవగాహననే మార్చగలదు అనడంలో ఎలాంటి సందేహం లేదు. హెన్రీ కాగన్, కెన్సో సోయిల కృషికి అభినందనలు.

- నాగరాజు మంచిపగడం
సీనియర్ కెమిస్ట్రీ ఫాకల్టీ
శ్రీ ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్, బీ ఎన్ రెడ్డి నగర్ హైదరాబాద్..
9052260100



# సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భద్రత

### - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**పెనుకొండ/శ్రీ సత్య సాయి, మహానాడు:**

పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం 70 మంది లబ్ధిదారులకు రూ.31,43,227 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, పెనుకొండ నియోజకవర్గ పరిధిలో గడిచిన 28 నెలల్లో 1,461 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ.15 కోట్ల 75 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు.

అర్హత కలిగిన పేదలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా పేద మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

త్వరలో నూతన పెన్షన్లు అందజేయడంతో పాటు పేదలకు గృహ



వసతి కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకు,లు కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ హాస్టళ్ల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం

### - బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్

**హైదరాబాద్, మహానాడు:** తెలంగాణలో ఎస్సీ వసతి గృహాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, హాస్టళ్ల నిర్వహణ పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల మాఫియా నడుస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. కాచిగూడలోని చారిత్రక ఎస్సీ హాస్టల్‌ను పునర్నిర్మించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రైవేటు భవనాల అద్దెల రూపంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. కాచిగూడ హాస్టల్ ఆధునిక పునర్నిర్మాణానికి వెంటనే రూ.100 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి పులి రామ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి జయదీప్, విష్ణు తదితరులతో కలిసి కాంతి కిరణ్ మాట్లాడారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ పిలుపు మేరకు తెలంగాణవ్యాప్తంగా ఎస్సీ హాస్టళ్ల పరిస్థితులపై క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు వసతి గృహాలను పరిశీలించేందుకు వెళ్తుంటే, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతో సిబ్బంది తమను లోపలికి అనుమతించకుండా గేట్లు మూసేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులను కలిసి వారి సమస్యలు తెలుసుకోకుండా అడ్డుకోవడం వెనుక ప్రభుత్వ పెద్దల కుట్ర ఉందని ఆరోపించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే, ఎస్సీ యువత భవిష్యత్తు కోసం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు సాధించే వరకు తమ పోరాటం ఆగదని కాంతి కిరణ్ స్పష్టం చేశారు.

# ఏవీఎస్ రాజు మృతి బాధాకరం

### దేశ నిర్మాణానికి ఆయన సేవలు చిరస్మరణీయం: సీఎం చంద్రబాబు

**అమరావతి, మహానాడు:**

నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం విచారకరమని పేర్కొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిపాలెంలో జన్మించిన ఏవీఎస్ రాజు.. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ)ని స్థాపించి విజయవంతంగా నడిపించారని గుర్తుచేశారు. నిబద్ధత,



నిజాయతీ కలిగిన దార్శనిక పారిశ్రామికవేత్తగా దేశ నిర్మాణానికి, అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

పారిశ్రామికవేత్తగా విశేష విజయాలు సాధించడంతోపాటు ఎన్‌సీసీ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పేదలకు అండగా నిలిచారని చంద్రబాబు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి సమాజహిత కార్యక్రమాలను చేపట్టి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారని తెలిపారు. ఏవీఎస్ రాజు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# జగన్ అక్రమాస్తుల కేసులో ఈడీ 9 ఛార్జీషీట్లు దాఖలు

### - సోమవారం నుంచి రోజువారీ విచారణ ?

**హైదరాబాద్:**

అక్రమాస్తుల కేసులో వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పై ఈడీ తొమ్మిది ఛార్జీషీట్లను దాఖలు చేసింది. ఇప్పటికే అనేక సంవత్సరాలుగా ఈడీ కేసులు సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని, సీబీఐ కేసులతో పాటు ఈడీ కేసులను కూడా త్వరగా విచారణ చేపట్టాలని సీబీఐ కోర్టులో ఈడీ పిటిషన్‌ను దాఖలు చేసింది.

జగన్ అక్రమాస్తుల కేసులో జగన్‌పై సీబీఐ 11 ఛార్జిషీట్లు దాఖలు చేసి విచారణ చేస్తుంది. ఈడీ కేసులు సోమవారం నుంచి రోజువారీ విచారణ చేపట్టే అవకాశాలున్నాయి.



# కాంగ్రెస్ సీఈసీలకు టికెట్లు, మంత్రి - గవర్నర్ పదవులు, పద్మ పురస్కారాలు

### - కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ప్రధాన ఎన్నికల కమిషనర్లతో కాంగ్రెస్‌కు ఉన్న సంబంధాల నేపథ్యంలో, ఆ పార్టీ సొంత పనితీరుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విమర్శలు గుప్పించారు. గతంలో కాంగ్రెస్ ఒక సీఈసీకి ఎన్నికల టికెట్ ఇస్తూ, మరొకరిని తమ ప్రభుత్వంలో మంత్రిని చేసిందని, ఇద్దరు ఎన్నికల కమిషనర్లను గవర్నర్లుగా నియమించిందని ఆయన గుర్తు చేశారు.

ఎన్నికల సంఘంతో వ్యవహారాల్లో కాంగ్రెస్ పక్షపాతంగా వ్యవహరిస్తోందని గోయల్ ఆరోపించారు. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు టీఎన్ శేషన్, ఎంఎస్ గిల్‌లకు ఆ పార్టీ బహుమతులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.

1999లో బీజేపీ సీనియర్ నాయకుడు లాల్ కృష్ణ అద్వానీకి వ్యతిరేకంగా శేషన్ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడాన్ని, గిల్ ఇంకా ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పనిచేస్తున్నప్పుడే 2000లో ఆయనకు పద్మవిభూషణ్ ప్రదానం చేయడాన్ని ఆయన ఉదహరిస్తూ, అటువంటి నిర్ణయాలు ప్రలోభాలు లేదా లంచాల కిందకు వస్తాయా? అని ప్రశ్నించారు.

అంతేకాకుండా, ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా తన పదవీకాలం ముగిసిన రెండు నెలల్లోపే 1986లో ఆర్.కె. త్రివేదిని గుజరాత్ గవర్నర్‌గా నియమించడాన్ని ఆయన ఉదహరించారు.

"ఒక విధంగా చూస్తే, ఎంఎస్ గిల్ ఉదంతం కూడా అలాంటిదే. ఆయన ప్రభుత్వంలో పనిచేశారు, ఎన్నికల కమిషనర్ అయ్యారు, పార్లమెంటులోకి ప్రవేశించారు, ఆ తర్వాత కేంద్ర మంత్రివర్గంలో చేరారు. ఇది కూడా ఒకరకమైన బేరసారంగానే కనిపిస్తోంది" అని చెప్పారు.

"ఆర్.కె. త్రివేదిని చూద్దాం. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఆయన పదవీకాలం 1985 డిసెంబర్ 31న ముగిసింది. కేవలం రెండు నెలల్లోపే, 1986 ఫిబ్రవరి 26న, రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను గుజరాత్ గవర్నర్‌గా నియమించింది," అని ఆయన పేర్కొన్నారు. 2005లో నవీన్ చావ్లాను ఎన్నికల కమిషనర్‌గా నియమించడంలో సోనియా గాంధీకి ఉన్న పాత్రపై కూడా గోయల్ ప్రశ్నలు లేవనెత్తారు.

ఆ సమయంలో ప్రభుత్వాన్ని ఎవరు నడిపించారని ప్రశ్నించిన ఆయన, అప్పటి విధానం ప్రకారం అటువంటి నియామకాలకు ప్రధాన మంత్రి, ప్రభుత్వమే బాధ్యత వహించేవారని గుర్తుచేశారు. అంతేకాకుండా, చావ్లా ప్రవర్తనపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ, ఆయన కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్. గోపాలస్వామి 2009లో ఆయనను తొలగించాలని చేసిన అభ్యర్థనను కూడా గోయల్ ప్రస్తావించారు.





ఆ అభ్యర్థనపై చర్య తీసుకోనందుకు మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా ఆయన విమర్శించారు. ప్రభుత్వంపై సోనియా గాంధీకి అధిక ప్రభావం ఉండేదని, మాజీ ప్రధాన మంత్రి పట్ల రాహుల్ గాంధీకి తగినంత గౌరవం ఉండేది కాదని ఆయన ఆరోపించారు.

"గత కొద్ది రోజులుగా రాహుల్ గాంధీ ప్రవర్తనను, ఆయన చర్యల్లోని ద్వంద్వ ప్రమాణాలను మరియు రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని బలహీనపరిచేలా ఉన్న ఆయన బాల్యచాపల్యం వంటి ప్రవర్తనను మనం చూస్తున్నాం. జాతీయ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా స్వతంత్రంగా పనిచేసేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం ఎన్నికల సంఘానికి సంపూర్ణ స్వయంప్రతిపత్తిని కల్పించింది. నియమితులైన ఏ ఎన్నికల కమిషనర్‌కూ రాజకీయ ప్రయోజనాలను కల్పించే ప్రయత్నం ఆ ప్రభుత్వం ఎప్పుడూ చేయలేదు" అని స్పష్టం చేశారు.

www.mahanadumedia.com

జనం గుండె చప్పుడు

మహానాడు

Mahanaadu Media

6

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం అక్టోబర్ 15, 2026

# ఎన్నికలు ముగిసే వరకు పరిశీలకులు క్షేత్రస్థాయిలోనే ఉండాలి

- నామినేషన్ నుంచి పోలింగ్ వరకు ప్రతి దశను పర్యవేక్షించాలి
- అభ్యర్థులకు లీగల్, మీడియా, డిజిటల్ సపోర్ట్ అందేలా సమన్వయం చేయాలి
- ఎక్కడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి లేకుండా పోటీ జరగకూడదు
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి



**తాడేపల్లి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు అత్యంత కీలక బాధ్యత తీసుకుని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలోనే ఉండి పార్టీ అభ్యర్థులకు అన్ని విధాలా అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు.

పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు--కోఆర్డినేషన్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శులు--కోఆర్డినేషన్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్లు, నామినేషన్లకు సంబంధించిన ప్రక్రియకు చాలా తక్కువ సమయం ఇస్తున్నారని సజ్జల అన్నారు. ఈ పరిస్థితుల్లో ఒక పని తర్వాత మరో పని చేసే అవకాశం లేకుండా, అభ్యర్థుల ఎంపిక, పత్రాల సిద్ధత, నామినేషన్లు, ప్రచారం అన్నీ సమాంతరంగా జరగాల్సి వస్తోందని చెప్పారు.

పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ స్పష్టంగా చెప్పినట్లుగా, ఎక్కడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి లేకుండా పోటీ జరగకూడదని, ఏ స్థానం కూడా అన్‌కంటెస్టెడ్‌గా ఉండకూడదని సజ్జల స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికకు సమయం తక్కువగా ఉన్నందున, కోఆర్డినేటర్లు వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఆ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా లేదా అన్నది పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అసెంబ్లీ కోఆర్డినేటర్ ఎన్నికల పనుల్లో పూర్తిగా నిమగ్నమై ఉంటారని, అందువల్ల అసెంబ్లీ పరిశీలకులు కోఆర్డినేటర్--పార్లమెంట్ పరిశీలకుడు--రీజినల్ కోఆర్డినేటర్--జిల్లా అధ్యక్షుడు--కేంద్ర కార్యాలయం మధ్య కీలక అనుసంధానకర్తలుగా పనిచేయాలని చెప్పారు. ఎక్కడైనా సమన్వయ లోపం, అభ్యర్థుల ఎంపికలో సమస్య, ప్రచార లోపం, నామినేషన్ ఇబ్బందులు కనిపిస్తే వెంటనే సరిదిద్దాలని, అవసరమైతే పైస్థాయికి నివేదించాలని సూచించారు.

రానున్న 15 నుంచి 20 రోజులు పరిశీలకులు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో 24/7 అందుబాటులో ఉండటం తప్పనిసరి అని సజ్జల స్పష్టం చేశారు. "ఇది మీటింగ్‌లలో కూర్చొని ప్రోటోకాల్ ప్రకారం చేసే పని కాదు. ఎక్కడ అవసరం ఉంటే అక్కడ ప్రత్యక్షంగా ఉండాలి. సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. అభ్యర్థికి 'మేమున్నాం' అనే భరోసా కలిగించాలి" అని చెప్పారు. చిన్నపాటి అంతర్గత విభేదాల నుంచి, సీనియర్ నాయకులతో సమన్వయం, స్థానికంగా నాయకులను కలుపుకోవడం వరకు పరిశీలకులు చొరవ తీసుకోవాలని సూచించారు.

# మారకపోతే సస్పెండ్ చేస్తా..

- ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా?
- విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల వైఫల్యంపై సీఎం రేవంత్‌హెచ్చరిక



**హైదరాబాద్:** మీలో మార్పు రాకపోతే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సీఎండీలను సస్పెండ్ చేస్తా అని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని హెచ్చరిక జారీ చేశారు.

బుధవారం రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు.

"పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# పురపాలక నోటిఫికేషన్‌లోనే పేద వర్గాలపై కుట్ర

- కుట్రలో రాష్ట్ర ఎన్నికల సంఘం భాగస్వామ్యమైందా?
- నామినేషన్లకు రెండు రోజులే గడువు ఇవ్వడం దారుణం:
- కుల ధ్రువీకరణ పత్రాలు రాకుండా చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీలను దెబ్బతీసే కుట్ర
- మున్సిపల్ చట్టం ప్రకారం అవకాశం ఉన్నా గడువు కుదించడం శోచనీయం
- వెంటనే గడువును 20వ తేదీ వరకు పెంచాలి.. లేదంటే న్యాయపోరాటం చేస్తాం : బోడె రామచంద్రయాదవ్



**మంగళగిరి:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ చూస్తుంటే.. బీసీలను వంచించే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కుట్రలో ఈసీ కూడా భాగస్వామ్యమైందా అనే అనుమానాలు కలుగుతున్నాయని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి 14వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చి కేవలం 16 నుంచి 18వ తేదీ వరకు మాత్రమే నామినేషన్లు వేయాలని గడువు విధించడం దారుణమన్నారు. ఈ రెండు రోజుల వ్యవధిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు ఎలా తెచ్చుకుంటారని ఆయన ప్రశ్నించారు. సాధారణంగా ఈ పత్రాలు రావడానికే 15 రోజుల సమయం పడుతుందని, పైగా ఎన్నికల సమయంలో ఇతర పార్టీల అభ్యర్థులను అధికారుల ద్వారా ఇబ్బంది పెట్టడం గతంలో చూశామని గుర్తుచేశారు.

గత జగన్ ప్రభుత్వంలో అధికారుల చేత బలవంతంగా సెలవులు పెట్టించి ప్రతిపక్షాల నామినేషన్లు అడ్డుకున్నారని, ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా అదే పంథాలో కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇవ్వడం రిజర్వేషన్ వర్గాలను వంచించడమేనని మండిపడ్డారు.

మున్సిపల్ చట్టం 1955లోని సెక్షన్ 33 ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చామని ఎన్నికల సంఘం చెబుతోందని, ఆ చట్టం ప్రకారం గరిష్టంగా 6 రోజుల వరకు అంటే 20వ తేదీ వరకు గడువు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇలా ఎందుకు చేశారో సమాధానం చెప్పాలన్నారు. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో అధికారులు అందుబాటులో ఉండరని తెలిసీ గడువును కుదించడం నూటికి నూరు శాతం బీసీలకు అన్యాయం చేయడమేనని విమర్శించారు.

# పోలవరం పనులపై అంతర్జాతీయ నిపుణుల సంతృప్తి

- ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ పనుల పరిశీలన
- ఈ నెల 17 వరకు ఎనిమిదో విడత పర్యటన

**పోలవరం, మహానాడు:** పోలవరం ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యామ్ నిర్మాణ పనులను అంతర్జాతీయ నిపుణుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. డ్యామ్‌లోని గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించిన నిపుణులు.. అనంతరం జీ హిల్ వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని వీక్షించారు. ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న పనుల వివరాలను రాష్ట్ర జలవనరుల శాఖ, మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ప్రతినిధులు వివరించారు. ఛాయాచిత్రాల ప్రదర్శన ద్వారా ఇప్పటివరకు చేపట్టిన పనులు, నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను



తెలియజేశారు. నిపుణుల పర్యటన సమయంలో కొద్దిసేపు వర్షం కురిసింది. తొలిరోజు పర్యటన అనంతరం నిర్వహించిన సమీక్షలో ఇప్పటివరకు జరిగిన పనుల పట్ల నిపుణులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న అంతర్జాతీయ నిపుణులు, కేంద్ర జలశక్తి శాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు అక్కడి నుంచి



పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్నారు. వారికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, ఎంఈఐఎల్ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం పీపీఏ సీఈఓ సంజీవ్ వోహ్రా అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. గత పర్యటనల్లో నిపుణులు చేసిన సూచనలు, సలహాల మేరకు చేపట్టిన చర్యలు, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని అధికారులు వివరించారు.

పోలవరం ప్రాజెక్టును ఇప్పటికే ఏడు విడతల్లో సందర్శించిన అంతర్జాతీయ నిపుణుల బృందం ప్రస్తుతం ఎనిమిదో విడత పర్యటనలో భాగంగా పనులను పరిశీలిస్తోంది. ఈ ఏడాది మే నెలలోనూ నిపుణుల బృందం పోలవరాన్ని సందర్శించింది. గతంలో ఇచ్చిన సూచనలు, సలహాలను అమలు చేసిన తీరు, వాటి ఆధారంగా చేపట్టిన పనుల పురోగతిని ప్రస్తుత పర్యటనలో పరిశీలిస్తోంది. అంతర్జాతీయ నిపుణులు, కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం పర్యటన ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగనుంది.

# భక్తుల సేవలో 'వేంకటాద్రి' యాప్

- 24 గంటలూ ఏఐ వాయిస్ అసిస్టెంట్..
- ఐదు భాషల్లో సేవలు




**తిరుమల, మహానాడు:** తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూపొందించిన 'వేంకటాద్రి' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని సులభంగా అందించడంతో పాటు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను సులువుగా చేరుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడనుంది.

ఈ యాప్‌లో 24 గంటల పాటు సేవలందించే కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వాయిస్ సహాయక వ్యవస్థతో పాటు, అంతర్జాల సదుపాయం లేకున్నా పనిచేసే మార్గదర్శక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. తాగునీటి కేంద్రాలు, ఆసుపత్రులు, మరుగుదొడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, దర్శన ప్రవేశ ద్వారాలు, అన్నప్రసాద కేంద్రాలు, బస్టాపులు తదితర 25 విభాగాలకు చెందిన 350కుపైగా ప్రదేశాల వివరాలను యాప్‌లో పొందుపరిచారు.

అత్యవసర ఫోన్ నంబర్లు, పోలీసు సేవలు, టీటీడీ సహాయ కేంద్రం, బస్సు మార్గాలు, సమయాల వివరాలను కూడా అందుబాటులో ఉంచారు. భక్తులు తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేశారో గుర్తుంచుకునేందుకు 'మార్క్ మై స్పాట్' సదుపాయాన్ని కల్పించారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లో రూపొందించిన ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో అందుబాటులో ఉంది. స్మార్ట్‌ఫోన్లు లేని భక్తుల కోసం సమాచార కేంద్రాల ద్వారా సేవలు అందించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది.

ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఎన్నారై దాత జేపీ యాప్ పనితీరును ముఖ్యమంత్రికి వివరించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేలా యాప్‌ను రూపొందించిన టీటీడీ అధికారుల కృషిని చంద్రబాబు అభినందించారు.

# తీరనున్న దర్శి ప్రజలకు తాగునీటి కష్టాలు

- రూ.120 కోట్లతో అమృత్ 2.0 పనులు ప్రారంభం



**దర్శి మహానాడు:** దర్శి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ.120 కోట్ల అమృత్ 2.0 పథకం పనులను బుధవారం ప్రారంభించారు. టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇంటింటికీ తాగునీరు అందించే పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. పట్టణంలోని సుమారు 8 వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించనున్నట్లు తెలిపారు. పులిపాడు చెరువు విస్తరణతోపాటు నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజలకు నిరంతరం తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

. కార్యక్రమంలో టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ తలారి కోటయ్య, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్లుండి కొత్త ఓటర్ల జాబితా వస్తుంటే హడావిడిగా స్థానిక ఎన్నికలా?

- పండగల వేళ కూటమి ప్రభుత్వానికి ఎందుకింత హడావిడి ?
- కూటమిది అర్ధరాత్రి ఆత్మలతో ఓట్లేయించిన చరిత్ర
- ఇప్పుడు మరోసారి చనిపోయిన వారి పేర్లతో ఎన్నికలు
- రేపు నామినేషన్లు కూడా అవే ఆత్మలతో వేయిస్తారా?
- నకిలీ ఓట్లతో మరోసారి గెలిచేందుకు కూటమి హడావిడి
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్




**తాడేపల్లి:** రాష్ట్రంలో ఓవైపు ఎల్లుండి కొత్త ఓటర్ల జాబితా రాబోతోందని, మరోవైపు త్వరలో దసరా, దీపావళి వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయని, అయినా లెక్కచేయకుండా పాత ఓటర్ల జాబితాలతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఆరాటం వెనుక కూటమి సర్కార్ కుట్ర దాగుందని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నేత సాకే శైలజానాథ్ మండిపడ్డారు.

రాష్ట్రంలో ఇంత హడావిడిగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించారు. గతంలో అర్ధరాత్రి ఆత్మలతో ఓట్లేయించుకుని గెలిచిన కూటమి సర్కార్... ఇప్పుడు మరోసారి అదే ట్రిక్ తో స్థానిక ఎన్నికల్నీ గెలిచేందుకు ప్రయత్నిస్తోందన్న అనుమానాలు కలుగుతున్నాయని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన శైలజానాథ్ తెలిపారు.

ఇవాళ ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకూ రాష్ట్రంలో ఓ డ్రామా జరిగింది. నిన్న స్థానిక ఎన్నికలకు సంబంధించిన సమాచారం అంతా ఉందని చెప్పిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. ఇవాళ ఉదయం జరగాల్సిన ప్రెస్ మీట్ ను జిల్లాల నుంచి సమాచారం లేదని మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ముఖ్యమంత్రి సైతం ఎన్నికల విషయంలో చాలా తొందరపడుతున్నారు. కూటమి ప్రభుత్వ అధికార వ్యామోహాన్ని అడ్డుకోలేకపోతే, అసమర్థత రాజకీయ వికృత క్రీడను అంతు చేయకపోతే ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత దిగజారడం ఖాయంగా కనిపిస్తోంది.

కూటమిలో ఉన్న పార్టీలకు సీట్ల పంపకాల్లో తేడాలు రావడం వల్లే ఎన్నికల సంఘం ప్రెస్ మీట్ ను మధ్యాహ్నానికి వాయిదా వేయించినట్లు అర్థమవుతోంది. మంగళగిరి, కాకినాడ, శ్రీకాకుళం, రాజమండ్రి ఎన్నికల వాయిదా వెనుక ఎవరి జోక్యం ఉందో అందరికీ అర్థమవుతోంది. కూటమిలో లెక్కలు కుదరలేదు కాబట్టే ఈ సీట్లలో ఎన్నికల్ని నిర్వహించకుండా వాయిదా వేసేశారు. ఇందులో వచ్చిన ఒక్క ఎస్టీ సీటు మంగళగిరిలో కూడా ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. ఇంత దుర్మార్గమైన రాజకీయ క్రీడ ఎందుకో ముఖ్యమంత్రి చెప్పాలి.

# జాతి నిర్మాణంలో తనదైన ముద్ర వేసిన పద్మశ్రీ డా. ఏ.వి.ఎస్. రాజు



దార్శనిక పారిశ్రామికవేత్త, కవి, జాతి నిర్మాణంలో తనదైన ముద్ర వేసిన మహనీయుడు

పద్మశ్రీ డా. అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు 2026 అక్టోబర్ 13వ తేదీ రాత్రి 7:15 గంటలకు తుదిశ్వాస విడిచారనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి, హృదయవేదనకు గురిచేసింది.

డా. ఏ.వి.ఎస్. రాజు విశిష్ట పారిశ్రామికవేత్తగా, దూరదృష్టి కలిగిన వ్యాపారవేత్తగా, దాతగా, సాహితీవేత్తగా భారతదేశంలో విశేష గుర్తింపు పొందారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ లిమిటెడ్) వ్యవస్థాపకుడిగా దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. నిర్మాణ రంగం అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.

వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఆయన అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2010లో ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. పారిశ్రామిక రంగంలోనే కాకుండా సాహిత్యం, ఆధ్యాత్మికత పట్ల కూడా ఆయనకు అపారమైన ఆసక్తి ఉండేది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ సత్యసాయి బాబా పట్ల తన భక్తిని, ఆధ్యాత్మిక భావాలను కవిత్వం ద్వారా వ్యక్తీకరించిన సాహితీవేత్తగా కూడా ఆయన ప్రత్యేకతను చాటుకున్నారు.

సాధారణ స్థాయి నుంచి అసాధారణ విజయాలను సాధించిన ఆయన జీవన ప్రయాణం భావితరాలకు స్ఫూర్తిదాయకం. దూరదృష్టి, కృషి, పట్టుదల, సేవాభావం ఆయన జీవితంలో ప్రతిబింబించిన విశిష్ట లక్షణాలు. సమాజానికి అర్థవంతమైన సేవలందిస్తూ, వివిధ రంగాల్లో తనదైన ముద్ర వేయడం ద్వారా ఆయన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

డా. ఏ.వి.ఎస్. రాజు మరణం పారిశ్రామిక, సాహిత్య, సామాజిక రంగాలకు తీరని లోటు. ఆయన అందించిన సేవలు, సాధించిన విజయాలు, సమాజానికి చేకూర్చిన ప్రయోజనాలు చిరకాలం గుర్తుండిపోతాయి. ఆయన ఆశయాలు, ఆదర్శాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. ఆ మహనీయుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను.

ఓం శాంతి.

**పాకలపాటి వెంకట సుబ్రహ్మణ్య వర్మ (విజయ్ వర్మ)**
(సినీ నిర్మాత & దర్శకుడు.)
దక్షిణ భారత సమన్వయకర్త: ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్, న్యూఢిల్లీ.

# దసరా ఉత్సవాల్లో ఏఐతో భక్తుల భద్రతకు పెద్దపీట

- కృత్రిమ మేధా పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నాం
- డీజీపీ హరీష్ కుమార్ గుప్తా




**విజయవాడ:** ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తోంది. "పోలీసు శాఖలో కృత్రిమ మేధా పరిజ్ఞానాన్ని ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నాం" అని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.

బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం మీడియా పాయింట్ లో మాట్లాడారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో సంప్రదాయ పోలీసు బందోబస్తుతోపాటు సాంకేతిక నిఘా వ్యవస్థలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ ఆధారిత రద్దీ విశ్లేషణ ద్వారా భక్తుల రాకపోకలను అంచనా వేయడం, రద్దీ పెరిగే ప్రాంతాలను గుర్తించడం, అవసరమైన చోట్ల సిబ్బందిని అప్రమత్తం చేయడం లక్ష్యంగా చర్యలు చేపట్టారు.

### డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

కొండపై, ఘాట్‌రోడ్డు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నారు. డ్రోన్ల నుంచి అందే దృశ్యాలను కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థతో అనుసంధానించి పరిస్థితులను సమీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రద్దీ పెరిగినప్పుడు సంబంధిత అధికారులు త్వరితగతిన స్పందించేందుకు ఈ వ్యవస్థలు తోడ్పడనున్నాయి.

### వాహనాల నియంత్రణకు ఆధునిక సాంకేతికత

దేవస్థానం పరిసరాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ANPR) కెమెరాలు, బూమ్ బ్యారియర్లు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. అనుమతి ఉన్న వాహనాల ప్రవేశాన్ని నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించి, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యం. దేవస్థానం ఇ.ఒ శీనా నాయక్, నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు డీజీపీ వెంట ఉన్నారు.

www.mahanadumedia.com

జనం గుండె చప్పుడు

# మహానాడు

Mahanaadu Media



డిజిటల్ న్యూస్ పేపర్ ‖ గురువారం అక్టోబర్ 15, 2026

## జగన్ వ్యక్తిగత హాజరుపై ఎలాంటి ఆదేశాలు లేవు

- మీడియా చేస్తున్నదంతా తప్పుడు ప్రచారమే
- వైయస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి




**తాడేపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను డైవర్ట్ చేయడం కోసం జగన్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలంటూ ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి మండిపడ్డారు. వైయస్ జగన్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ, సీబీఐ కోర్టులో జగన్‌కు షాక్ అంటూ ఎల్లోమీడియా తప్పుడు ప్రచారానికి తెర తీసిందని ఆయన ఆక్షేపించారు.

పిటిషన్లపై ఇప్పటికే రోజువారీ విచారణలు జరుగుతున్నాయని, అయినప్పటికీ రోజువారీ విచారణలు జరపాలంటూ ఈడీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడంపై అనుమానం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేతిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఒక కీలుబొమ్మలా మారిందని, ఈడీని కేంద్రంగా చేసుకుని చంద్రబాబు రాజకీయ కుట్రలకు తెరలేపాడనే ఆరోపణలకు ఈ సంఘటన బలం చేకూర్చేలా ఉందని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించేందుకు జగన్ వ్యక్తిగత హాజరుకు కోర్టు ఆదేశాలంటూ తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నారు.

జగన్‌వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలంటూ ఎలాంటి ఆదేశాలు లేనప్పటికీ, సీబీఐ కోర్టులో జగన్‌కు షాక్ అంటూ ఎల్లోమీడియా తప్పుడు ప్రచారానికి తెర తీసింది. జగన్ గారిపై నమోదైన కేసుల్లో ఇప్పటికే రోజువారీ విచారణలు జరుగుతున్నాయి. అయినప్పటికీ రోజువారీ విచారణలు జరపాలంటూ ఈడీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిందని జగన్ తరఫు న్యాయవాదులు సీబీఐ కోర్టుకు వివరించారు. ఈ కేసులను త్వరగా తేల్చాలని తామే కోరుతున్నామని, పిటిషన్లపై ఇప్పటికే రోజువారీ విచారణ జరుగుతోందని వారు స్పష్టం చేశారు

## కులాలు మార్చుతూ సర్టిఫికెట్ల జారీ

- ధృవీకరణ పత్రాల జారీలో కావాలనే జాప్యం
- అధికార ధుర్వినియోగానికి పాల్పడుతూ బెదిరింపులు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ రెడ్డి



**తాడేపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతూ కుట్రలు పన్నుతోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ రెడ్డి ధ్వజమెత్తారు.

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న తరుణంలో వైఎస్సార్‌సీపీకి చెందిన బలమైన అభ్యర్థులను పోటీకి దూరం చేయాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగాన్ని తమకు అనకూలంగా ఉపయోగించుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయడం, గతంలో జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలకు భిన్నమైన వివరాలు తెరపైకి తేవడం, పోలీసుల ద్వారా అభ్యర్థులను ప్రశ్నించడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన పుత్తా శివశంకర్ తేల్చి చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలని, ప్రజల మద్దతు ఎవరికి ఉందో ఎన్నికల ఫలితాలే నిర్ణయించాల్సి ఉన్నా సరే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీలో ఉంటే తమకు ఇబ్బందులు తప్పవనే భయంతో వారిని సాంకేతిక కారణాలతో అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా వ్యక్తుల పేర్లు, చిరునామాల్లో మార్పుల గురించి వింటుంటామని, కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కుల ధ్రువీకరణ పత్రాల విషయంలోనే వివాదాస్పద పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

## ఇప్పుడు కథ ఎమర్జెన్సీ కూడలిలో..

మాస్టర్ క్రిమినల్ బ్రెయిన్ 10 ఏళ్లకు పైగా ఆడుతున్న 'స్టేలింగ్ డేస్' గేమ్ మీద ఈడీ తెలంగాణ హైకోర్టు గుమ్మం తొక్కితే, సీబీఐ కోర్టు ఎందుకు ఎమర్జెన్సీ బెల్ కొట్టింది?

**ఫైల్ నంబర్: 33845/2026.**

కొన్ని పేజీల రిట్ పిటిషన్. కానీ ఆ కాగితాల వెనుక పదేళ్లకు పైగా నిద్రపోతున్న ఒక కేసు ఉంది.

**ఫ్రీజర్‌లో పడిన ఫైళ్లు**

2016లో ఈడీ తన మొదటి ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు చేసింది. 2021 నాటికి తొమ్మిది. కోర్టు వాటిని పరిగణనలోకి కూడా తీసుకుంది. ఇక కేసుల విచారణ పరుగెత్తాలి. కానీ గడియారం ఆగింది.

నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో అదే గది, అదే బల్ల, అదే మొదటి పేజీ. జుణ మాటల్లో, పదేళ్లయినా విచారణ ప్రాథమిక దశ దాటలేదు. అసలు ప్రశ్న: ఎందుకు?

**'స్టేలింగ్ డేస్'**

డిశ్చార్జ్ పిటిషన్ల గుట్ట: వార్తా కథనాల ప్రకారం 141, అంటే సీబీఐ కేసుల్లో 86, ఈడీ కేసుల్లో 55. వాదనలు జరిగాయి, తీర్పు రాలేదు.

మారిన కుర్చీలు: పదులకొద్దీ న్యాయమూర్తుల బదిలీలతో కథ మళ్లీ మొదటికి.

డజన్ల కొద్దీ నిందితులు: దాదాపు 70 మంది. వాయిదాలు, హాజరు మినహాయింపులు, ఉత్తర్వులపై సవాళ్లు.

ఈడీ కేసు సీబీఐ మూల నేరంపై ఆధారపడుతుంది. ఒకటి ఆగితే రెండోదీ ఆగాలి అని వేల కోట్ల అక్రమాస్తుల క్రిమినల్ శాసించడం.

**కానీ ఓ రోజు పాపం పండాల్సిందే కదా!**

ఈడీ ఈసారి నాంపల్లి తలుపు తట్టలేదు. వెళ్లింది తెలంగాణ హైకోర్టుకు. కానీ "కేసును మీరే విచారించండి" అని అడగలేదు. అడిగింది ఒక్కటే: "కింది కోర్టును కదిలించండి."

ఆయుధం ఆర్టికల్ 21లోని సత్వర విచారణ హక్కు. అభ్యర్థన రోజువారీ విచారణ. ఇక్కడ హైకోర్టు ఆటగాడు కాదు, ఆటను పరుగెత్తించే రిఫరీ.

**నాంపల్లిలో వేడెక్కిన గాలి**

రిట్ పడింది. ఒత్తిడి పెరిగింది. సీబీఐ ప్రత్యేక కోర్టు ఈడీ కేసులనూ సీబీఐ కేసులతో కలిపి రోజువారీగా విచారించాలని నిర్ణయించింది. జగన్ సహా సుమారు 70 మంది నిందితులూ వ్యక్తిగతంగా హాజరు కావాలని చెప్పలేదు కానీ వారి న్యాయవాదులు రోజూ రావాలని చెప్పింది. పదేళ్లు కదలని ఫైళ్లు ఒక్కసారిగా కదిలాయి.

**సుప్రీంకోర్టు ప్రెజర్ కూడా కారణం**

మొదటిది, సుప్రీంకోర్టు పర్యవేక్షణ. అశ్విని ఉపాధ్యాయ్ కేసులో ప్రజాప్రతినిధుల కేసులపై పర్యవేక్షణ మొదలైంది.

అందుకే చిక్కు ప్రశ్న: పర్యవేక్షించాల్సిన హైకోర్టు ఇన్నేళ్లు ఎక్కడ? ఒక్క



దానిపైనే సందేహం మంచిదికాదు. కింది కోర్టు నెమ్మదించింది, న్యాయ మార్గాలన్నీ వాడుకున్నారు, పర్యవేక్షణ గట్టిగా లేదు.

రెండవది, ్రామీూా సెక్షన్ 24. ఇది ట్రయల్ దశలో వర్తించే రివర్స్ బర్డెన్ నిబంధన. మనీలాండరింగ్ కేసులో ప్రాసిక్యూషన్ ప్రాథమిక వాస్తవాలు నిరూపించిన తర్వాత, ఆస్తి "నేర ఆదాయం" అని కోర్టు భావిస్తుంది. కాదని నిరూపించే బాధ్యత నిందితుడిపై ఉంటుంది. ఈ నిబంధనను విజయ్ మదన్‌లాల్ చౌదరి (2022) కేసులో సుప్రీంకోర్టు సమర్థించింది. అంటే ట్రయల్ మొదలైతే, ఆస్తుల మూలాలు వివరించే భారం, బాధ్యత నిందితులపై పడుతుంది.

**క్లైమాక్స్?**

ఇప్పుడు కథ ఎమర్జెన్సీ కూడలిలో నిలబడింది.

ఒక దారి: రోజువారీ విచారణ నిజంగా సాగుతుంది. పదేళ్ల ప్రశ్నకు, ప్రజల సహనానికి సమాధానం దొరుకుతుంది.

మరో దారి: కొత్త పిటిషన్లు, కొత్త స్టేలు, కొత్త వాయిదాలు. గడియారం మళ్లీ ఆగుతుంది.

ఏ దారి ఎంచుకుంటారో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. అందుకే ఇది అత్యవసర కూడలి.

43 వేల కోట్ల అక్రమార్జన ఆరోపణల కేసు ఇంకా ప్రాథమిక దశలోనే ఉండటం ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. మరోదారి అయితే మాత్రం న్యాయ వ్యవస్థల పట్ల ప్రజల నమ్మకం సన్నగిల్లుతుంది. గౌరవం బదులు అసహనం, చిరాకు వేస్తుంది. అందులో ఉన్న మాస్టర్ క్రిమినల్ బ్రెయిన్ ఆ వెసులుబాట్లతో మరోసారి దానికి మించి లూటీ చేసి డెమోక్రసీ డ్రామాలు ఆడుతున్నాడు.

న్యాయం ఆలస్యమైతే అది న్యాయ నిరాకరణే. ఆ మాట ఆరోపణ చేసేవారికీ వర్తిస్తుంది, ఎదుర్కొనేవారికీ వర్తిస్తుంది. నిర్దోషి అయితే త్వరగా తేలాలి. దోషి అయినా త్వరగా తేలాలి.

పదేళ్లు మౌనంగా ఉన్న ఫైళ్లు ఇప్పుడు మాట్లాడబోతున్నాయి.

క్లైమాక్స్ ఇంకా రాయబడలేదు. ధర్మం మాత్రం చూస్తూ ఉంటుంది.

**- చాకిరేవు**

## రైతులకు ఇచ్చింది 8 గంటల కరెంటే

- గట్టు సబ్‌స్టేషన్ లాగ్‌బుక్ రికార్డులే సాక్ష్యం
- రేవంత్ సర్కార్ పాలనలో రైతులకు 8 గంటల కరెంట్ కూడా దక్కడం లేదు
- నిన్న ఇచ్చిన 7 గంటల 50 నిమిషాల కరెంటులోనూ మూడుసార్లు కోతలే
- లాగ్‌బుక్‌ను స్వయంగా తనిఖీ చేసి కాంగ్రెస్ వైఫల్యాన్ని ఎండగట్టిన మాజీ మంత్రి హరీశ్ రావు



**గద్వాల:** గట్టు మండలంలో సాగునీరు, విద్యుత్ అందక ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి విద్యుత్ సరఫరా తీరును పరిశీలించేందుకు గట్టు మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లోని అధికారిక లాగ్‌బుక్‌ను పరిశీలించిన అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ. ..గట్టు మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని ఉదయం నుంచి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల ఆవేదన వాస్తవమా కాదా అని స్వయంగా నిర్ధారించుకోవడానికే తామంతా గట్టు సబ్‌స్టేషన్‌కు వచ్చి అధికారుల అధికారిక లాగ్‌బుక్‌ను స్వయంగా పరిశీలించాం. నిన్న అక్టోబర్ 13 లాగ్‌బుక్ రికార్డుల ప్రకారం రైతులకు ఇచ్చిన త్రీఫేస్ కరెంట్ కేవలం 7 గంటల 50 నిమిషాలు మాత్రమే. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం 8 గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోయింది. ఆ ఇచ్చిన 7 గంటల 50 నిమిషాల్లో కూడా నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వలేదు.

అందులోనూ మూడు సార్లు విద్యుత్ సరఫరాను బంద్ చేశారు. ఒకసారి గంట సేపు, మరోసారి ఐదు నిమిషాలు, ఇంకోసారి పది నిమిషాల పాటు కరెంట్ నిలిపివేశారు. ఇచ్చిన అరకొర సమయంలోనే మూడు నాలుగు సార్లు కరెంట్ కోతలు పెట్టడం సిగ్గుచేటు.

లాగ్‌బుక్ ఆధారంగా సబ్‌స్టేషన్ ఆపరేటర్‌ను నిలదీస్తే చేదు నిజాలు బయటపడ్డాయి. మేం ఏం చేస్తాం సార్.. పైనుంచి బంద్ చేయమంటే బంద్ చేస్తాం, ఆన్ చేయమంటే ఆన్ చేస్తాం.. మా ఫోన్లకు అధికారుల నుంచి బంద్ చేయమని మెసేజ్‌లు వస్తాయి.. మెసేజ్ రాగానే బంద్ చేస్తాం తప్ప మా చేతుల్లో ఏమీ లేదు.. పైనుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంత కరెంట్ ఇస్తే అంతే ఇస్తాం అని ఆపరేటర్ తన ఫోన్ చూపిస్తూ స్పష్టం చేశాడు. దీన్నిబట్టి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పైనుంచే రైతుల కరెంట్‌ను కట్ చేస్తోందని రుజువైంది.

## కేటీఆర్ నయా దందా.. కంపెనీలను బెదిరించి వసూళ్లు!

- హోటల్ ఆదాయం రోజుకు రూ.75 లక్షలు
- కేటీఆర్ చీకటి బాగోతాలను బయటపెడుతూనే ఉంటా
- దమ్ముంటే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి
- ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్




**హైదరాబాద్, మహానాడు:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేటీఆర్ కంపెనీలను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆయనకు సంబంధించిన వ్యాపార వ్యవహారాలు, హోటల్ ఆదాయం పెరుగుదలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. కేటీఆర్ నయా దందా, వసూళ్ల వ్యవహారాలను వరుసగా బయటపెడతానని ప్రకటించారు.

కేటీఆర్‌ను ఉద్దేశించి బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. "కేటీఆర్ అంకుల్.. నువ్వు నన్ను గోకినా, గోకకపోయినా నేను మాత్రం నిన్ను గోకుతూనే ఉంటా. మొన్ననే చెప్పా.. నీ చీకటి బాగోతాలను వరుసగా బయటపెడుతూనే ఉంటా. కేటీఆర్‌కు సవాల్ విసిరినా ఇప్పటివరకు ప్రజలకు సమాధానం చెప్పలేదు" అని వ్యాఖ్యానించారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఆధారాలు బయటపడకూడదనే ఉద్దేశంతోనే హెయిర్ ట్రీట్‌మెంట్ చేయించుకున్నారంటూ తాను ఆరోపించానని పేర్కొన్నారు. తాను మీడియా సమావేశం నిర్వహించిన మూడు గంటల తర్వాత కేటీఆర్ వంటగదిలో ఉన్న ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారని, అందులో ఆయన ముఖం వాపుతో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

కేటీఆర్ కొత్త తరహా వసూళ్ల వ్యవహారాన్ని వివరిస్తూ.. ఉదయం 11 గంటలకు ఒక బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం, మధ్యాహ్నం 12 గంటలకు మరో బృందం మీడియా సమావేశం నిర్వహించడం, సాయంత్రం 4 గంటలకు సంబంధిత సంస్థ వద్ద సామాజిక మాధ్యమాల బృందం హడావుడి చేయడం, రాత్రి 7 గంటలకు కేటీఆర్ ప్రధాన బృందం సభ్యులు సంస్థ యజమానులతో చర్చలు జరపడం జరుగుతోందని ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకపోతే రాత్రి 8 గంటలకు నార్సింగిలోని కేటీఆర్ నివాసంలో కంపెనీ యజమానులతో చర్చించి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని విమర్శించారు. ఇవన్నీ కేటీఆర్ నయా దందాలో భాగమని ఆరోపించారు.

డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం భారీగా పెరగడంపై తనకు అనుమానాలు ఉన్నాయని బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. రూ.5 కోట్ల వాటా విలువ ఉన్న హోటల్ ఆదాయం పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. హోటల్ ద్వారా రోజుకు రూ.75 లక్షల ఆదాయం వస్తోందని ఆరోపించారు. ఐటీ మంత్రిగా, షాడో ముఖ్య మంత్రిగా వ్యవహరించిన సమయంలో బహుళజాతి కంపెనీలను బెదిరించి, తమ హోటల్ నుంచే ఆహారం సరఫరా చేయడం, సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించేలా ఒప్పందాలు చేయించుకున్నారా? అని ప్రశ్నించారు. ఆ ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయా? అని నిలదీశారు.

కేటీఆర్ బంధువు సంకేత్, సామాజిక మాధ్యమాల్లో తనపై తప్పుడు వార్తలు ప్రచారం చేయడం వంటి అంశాలపైనా తనకు సమాచారం ఉందని అన్నారు. కేటీఆర్, ఆయన బృందం చేస్తున్న వసూళ్ల వ్యవహారాలను బయటపెడతానని హెచ్చరించారు.

కేటీఆర్‌కు సంబంధించిన సిరిసిల్ల వ్యవహారాలను తదుపరి బయటపెడతానని బల్మూర్ వెంకట్ ప్రకటించారు. తాను చేసిన ఆరోపణలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని, కేటీఆర్‌కు ధైర్యం ఉంటే వాటిపై స్పందించాలని సవాల్ విసిరారు.

## ఉద్యోగాల కల్పనలో టీడీపీ ముందంజ

- 14 సార్లు డీఎస్సీ నిర్వహించిన ఘనత తెలుగుదేశం పార్టీదే
- 1.96 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాం
- బ్రాహ్మణ నిరుద్యోగ యువత డీఎస్సీ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్



**మంగళగిరి, మహానాడు:**

విద్యతోనే వికాసం సాధ్యమని నమ్మిన తెలుగుదేశం పార్టీ దశాబ్దాలుగా నిరుద్యోగుల కన్నీళ్లు తుడుస్తూ, ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేస్తోందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో 14 సార్లు ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) నిర్వహించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని, ఇప్పటివరకు సుమారు 1.96 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబు నాయకత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన

నారా లోకేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయని బుచ్చి రాంప్రసాద్ పేర్కొన్నారు. గతంలో 72 శాతంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి ఉత్తీర్ణత శాతం ప్రస్తుతం 76 నుంచి 78 శాతానికి పెరిగిందని వివరించారు. గత పాలకుల హయాంలో ప్రైవేటు విద్యాసంస్థల ఫలితాలే ప్రముఖంగా ప్రచారమయ్యేవని, ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ బడులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

చదువుతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులను గౌరవించడం, గురువుల పాదపూజ వంటి భారతీయ సంప్రదాయాలను ప్రోత్సహిస్తూ మంత్రి లోకేశ్ స్వయంగా ఆచరించి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును భాగస్వామిగా చేసుకుని విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, సంస్కారం, బాధ్యతాయుత ప్రవర్తనపై ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత వైసీపీ పాలనలో విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆ దురాచారాలను అరికట్టడంతో పాటు విద్యార్థుల్లో సంస్కారం, నైతిక విలువలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి 25 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేశ్ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలోని బ్రాహ్మణ నిరుద్యోగ యువత ప్రభుత్వం విడుదల చేస్తున్న ఉద్యోగ నియామక ప్రకటనలు, డీఎస్సీ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బుచ్చి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు, అధ్యయన సామగ్రి, సమగ్ర మార్గదర్శకత్వం అందించేందుకు బ్రాహ్మణ కార్పొరేషన్ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు అవసరమైన సహాయ సహకారాల కోసం కార్పొరేషన్‌ను సంప్రదించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు అర్హులైన బ్రాహ్మణ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు సాధించేలా కార్పొరేషన్ పూర్తి సహకారం అందిస్తుందని బుచ్చి రాంప్రసాద్ స్పష్టం చేశారు.

## కాక్రోచ్ పార్టీకి అమెరికా నిధులు

- మోదీని వ్యతిరేకించేవారి నుంచి ఫండ్
- భారతీయులే కాక్రోచ్‌కు వ్యతిరేకంగా పోరాడాలి
- భారతీయ కలలకు ప్రకాశవంతమైన దీపం మోదీ
- గతంలోనూ మోదీకి మేరీ మిల్బెన్ మద్దతు
- అమెరికా సింగర్ మేరీ మిల్బెన్ సంచలన ఆరోపణలు



మోదీ సర్కారుకు వ్యతిరేకంగా అమెరికా కుట్ర చేస్తోందా? కాక్రోచ్ పార్టీ ఇటీవలి కాలంలో చేస్తున్న ఆందోళనల వెనక అమెరికా ఆర్థికసాయం ఉందా? అంటే.. అవునంటున్నారు ప్రముఖ అమెరికన్ సింగర్. మేరీ మిల్బెన్.

ప్రధాని మోదీని వ్యతిరేకించే కొందరు అమెరికన్ దాతలు, భారత్‌లోని కాక్రోచ్ జనతా పార్టీ కి నిధులు సమకూరుస్తున్నారని ప్రముఖ అమెరికన్ గాయని మేరీ మిల్బెన్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ సంస్థకు వ్యతిరేకంగా భారత యువత శాంతియుత మార్గంలో ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్‌ను పంచుకున్నారు.

అభిజిత్ దీప్కేను, కాక్రోచ్ జనతా పార్టీని ఉద్దేశిస్తూ, "భారతదేశ యువ దేశభక్తులారా, ఇది మౌనంగా ఉండాల్సిన సమయం కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో రూపుదిద్దుకుంటున్న మీ భవిష్యత్తును అడ్డుకోవాలని చూస్తున్న అమెరికా దాతల నుంచి వీరికి ఆర్థిక సాయం అందుతోంది" అని ఆమె పేర్కొన్నారు. "యువ దేశభక్తులారా, మీరు దేనికీ భయపడకండి. 25 ఏళ్ల పాటు ప్రజా సేవలో ఉండి, వరుసగా మూడుసార్లు ప్రధానిగా ఎన్నికైన మీ నాయకుడు, నా దేశం నుంచి వస్తున్న ఇటువంటి విచ్ఛిన్నకర శక్తులకు ఎన్నటికీ తలవంచరు" అని ఆమె రాసుకొచ్చారు.

భారత గడ్డపై పుట్టి పెరిగిన వారే ఈ విచ్ఛిన్నకర కాక్రోచ్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడాలని, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. "యువ దేశభక్తులారా, మేల్కొనండి!" అంటూ ఆమె తన పోస్ట్‌ను ముగించారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంప్రదాయవాద నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి ఓ ప్రత్యేకమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నారని ఆమె ఆరోపించారు.

"నిర్దేశిత దేశానికి చెందిన వ్యక్తులకు అమెరికాలో విద్యనందించి, వారిలో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి, తిరిగి స్వదేశానికి పంపి అశాంతి, విధ్వంసం సృష్టించేందుకు నిధులు సమకూరుస్తారు" అని ఆమె వివరించారు. ఇటువంటి ప్రయత్నాలు పూర్తిగా విజయవంతం కాకపోయినా, దేశ అభివృద్ధి, సుపరిపాలనపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆమె అభిప్రాయపడ్డారు.

ప్రధాని మోదీకి మద్దతుగా మేరీ మిల్బెన్ నిలవడం ఇది మొదటిసారి కాదు. ఇటీవలే మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను "భారతీయ కలలకు ప్రకాశవంతమైన దీపం" అని ఆమె కొనియాడారు.

గతంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొనాల్సిన మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూసిన వారిని కూడా ఆమె తీవ్రంగా విమర్శించారు. సీజేపీ, అభిజిత్ దీప్కే ఆర్థిక లావాదేవీలపై గతంలోనూ అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి.

## స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై కేసుల వివరాలు వెల్లడించాలి

- ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులకు తగిన ఆదేశాలు ఇవ్వాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను కోరిన వైఎస్సార్సీపీ



**తాడేపల్లి:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులపై నమోదైన/పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించేందుకు పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను వైఎస్సార్సీపీ కోరింది.

ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి లేఖ రాశారు. ఇందులో ఆయన కూటమి సర్కార్ పోలీసుల సాయంతో వైఎస్సార్సీపీ ఆశావహ అభ్యర్థులపై చేస్తున్న వేధింపుల్ని ప్రస్తావించారు. వాటిని అడ్డుకోవడంతో పాటు తమ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవసరమైన వివరాలు అందించేందుకు రాష్ట్ర డీజీపీకి తగిన ఆదేశాలు ఇవ్వాలని కూడా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కోరారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆశావహ అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వేధిస్తోందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధం లేకపోయినా, వివిధ పోలీస్ స్టేషన్లలో తమ పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలు వారిలో భయాందోళనలు సృష్టించడంతోపాటు ఎన్నికల ప్రక్రియలో వారు పాల్గొనడానికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

అంతేకాకుండా, తమపై కేసులు ఎక్కడ నమోదు అయ్యాయో, ఏ పోలీస్ స్టేషన్‌లో లేదా ఏ జిల్లాలో కేసులు నమోదయ్యాయో కూడా అనేక మంది ఆశావహ అభ్యర్థులకు తెలియజేయడం లేదన్నారు. ఫలితంగా, సంబంధిత సమాచారాన్ని పొందడానికి వారు ఏ అధికారులను సంప్రదించాలో తెలియక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో నామినేషన్ పత్రాల్లో కేసులకు సంబంధించిన పూర్తి, కచ్చితమైన వివరాలను సమర్పించడంలో పలు సమస్యలు ఎదురవుతున్నాయని ఎస్ఈసీకి రాసిన లేఖలో వెల్లడించారు.

www.mahanadumedia.com
జనం గుండె చప్పుడు
# మహానాడు
Mahanaadu Media

డిజిటల్ న్యూస్ పేపర్ || గురువారం అక్టోబర్ 15, 2026 ||

# పాలమూరు పంపులు ఆపకుండా నడపాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



హైదరాబాద్: సిగ్గు లేదా జీడిగింజా అంటే నల్లగున్న నాకేం సిగ్గు అన్నట్లుంది మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు. మూడేళ్లుగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పడావు పెట్టింది ఎవరు ? బీఆర్ఎస్ పాలనలోనే పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాలువల టెండర్లను రద్దు చేసింది ఎవరు ? గత మూడేళ్లుగా కాలువల తవ్వకుండా అడ్డుకున్నది ఎవరు ?

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు సాగకుండా కేసులు వేసింది కాంగ్రెస్ పార్టీ కాదా ? అప్పుడు జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నది నిజం కాదా ? మూడేళ్ల క్రితమే నార్లాపూర్ లో పంపును కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలంగాణ మొత్తానికి తెలుసు కదా?

మరి ఎల్ నినో వస్తుంది, కరువు తెస్తుంది అని తెలిసినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులు ప్రారంభించి నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్ లు నింపాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నా ఎందుకు స్పందించలేదు ? నార్లాపూర్, ఏదుల మధ్యన పెండింగ్ పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ గత మూడేళ్లుగా డిమాండ్ చేస్తున్న విషయం తెలియదా ?

శ్రీశైలంలో నీళ్లు ఉన్నా నార్లాపూర్ పంపులు గత రెండు నెలలుగా ఎందుకు ప్రారంభించలేదు ? ప్రభుత్వానికి చిత్తశుద్ది ఉంటే, రైతుల మీద ప్రేమ ఉంటే రెండు పంపులు నడిపి వట్టెం, కరివెన వరకు సాగునీరు తీసుకువెళ్లొచ్చు పది పంపులు నడపాలి అంటే పెండింగ్ పనులు అడ్డంకిగా ఉంటాయి .. నార్లాపూర్, ఏదులలో రెండు పంపులు నడపడానికి ఎలాంటి ఇబ్బందులు లేవు

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులు పూర్తి స్థాయిలో ఎందుకు నడపలేదు ? శ్రీశైలం నీళ్లు ఏపీ ప్రభుత్వం 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పంకు తరలించింది. బీఆర్ఎస్ పార్టీ ముల్లుకర్ర పెట్టి కుచ్చితే కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి రావడం లేదు. బీఆర్ఎస్ పార్టీ హెచ్చరికల నేపథ్యంలోనే కాంగ్రెస్ కళ్లు తెరిచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపు మోటార్లు ఆన్ చేసింది

ఇప్పటికైనా నార్లాపూర్ రిజర్వాయర్ పూర్తిగా నిండే వరకు మోటార్లు నడపాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పడావు పెట్టిన పనులు వెంటనే పూర్తి చేయాలి. మూడేళ్లుగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు నిలిపి వేసినందుకు పాలమూరు రైతాంగానికి క్షమాపణ చెప్పాలి.

# ఇజ్రాయెల్ పౌర భద్రతా సంస్కృతి నిర్మాణం.. భారత్‌కు ఆదర్శం!

( చక్రధారి రోవ్ )

సెప్టెంబర్ 30న, ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్ జెడ్ 1073 దుబాయ్ నుండి ఇజ్రాయెల్‌కు సమీపిస్తుండగా, దాని కో-పైలట్ కెప్టెన్‌పై కత్తితో దాడి చేసి, విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించాడని ఆరోపణలు ఉన్నాయి. ఆ బోయింగ్ విమానం రెండు నిమిషాల్లో 17,000 అడుగులకు పైగా ఎత్తును కోల్పోయింది. ఏ పోలీసు బృందం గానీ, గ్రౌండ్ కంట్రోలర్ గానీ సమయానికి ఆ కాక్‌పిట్‌కు చేరుకోలేకపోయారు, కాబట్టి అప్పటికే విమానంలో ఉన్నవారే ఈ విషయాన్ని చక్కదిద్దారు.

గాయపడిన భారత జాతీయుడైన కెప్టెన్ స్టీవ్ మచ్చర్, కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేశారు. ఇజ్రాయెల్ ప్రయాణికుడైన యానివ్ హయూన్, దాడి చేసిన వ్యక్తిని బయటకు లాగి, నియంత్రణలను వెనక్కి లాగాడు. కనీసం నలుగురు ఇజ్రాయెల్ వాసులు దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడానికి సహాయపడ్డారు. ఒక దంతవైద్యుడు కెప్టెన్ గాయాలకు చికిత్స చేశారు. ప్రయాణికులను ప్రయాణిస్తున్న ఇద్దరు విధుల్లో లేని పైలట్లు సౌదీ అరేబియాలోని తబుక్‌లో విమానాన్ని ల్యాండ్ చేశారు.

ఈ ప్రయాణికులు కేవలం అదృష్టవంతులు లేదా ధైర్యవంతులు మాత్రమే కాదు. దశాబ్దాలుగా ఇజ్రాయెల్ నిర్మించుకున్న భద్రతా సంస్కృతికి ఇవి ప్రతిఫలాలు. ఈ సంస్కృతిలో, ఏ నిపుణుడూ రాకముందే, సంక్షోభం తలెత్తిన తొలి నిమిషాల్లోనే స్పందించే సామర్థ్యం ప్రతి పౌరుడికీ ఉండాలని ఆశిస్తారు. ఒక భారతీయ పరిశీలకుడికి ఈ సంఘటనలో మరో అర్థం కూడా ఉంది. ఎందుకంటే ఆ తలుపు తెరవాలనే నిర్ణయం తీసుకుని రక్షణ చర్యను సాధ్యం చేసిన కెప్టెన్ మనవాడే. ఇజ్రాయెల్ ఆ సంస్కృతిని ఎలా సృష్టించిందో, దాని నుండి భారతదేశం ఏమి స్వీకరించగలదో ఈ వ్యాసం విశ్లేషిస్తుంది.

### విఫలమైన ఒక పరిశీలన వ్యవస్థ

మీడియా నివేదికలలో ఒమన్ జాతీయుడైన హమామ్ అల్-హమ్మామిగా గుర్తించిన కో-పైలట్, విమానంలో రెండవ అత్యంత విశ్వసనీయమైన స్థానంలో ఉన్నాడు. తీవ్రవాద భావజాలం పట్ల ఆందోళనల కారణంగా ఒమన్ అతడిని విమానం నడపకుండా నిషేధించిందని మీడియా నివేదికలు చెబుతున్నాయి. అయినప్పటికీ యూఏఈకి చెందిన ఆ విమానయాన సంస్థ అతడిని నియమించుకుని, తమ అత్యంత సున్నితమైన మార్గాలలో ఒకదానిలో నియమించింది.

యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ ఈ చర్యను ఉగ్రవాద దాడి ప్రయత్నంగా అభివర్ణించారు. ఇజ్రాయెల్ భద్రతా అధికారులు ప్రస్తుతం అతను ఒంటరిగానే ఈ పని చేశాడని భావిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది. ఒమన్ ఇతర ప్రభుత్వాలకు లేదా విమానయాన సంస్థలకు ఏమి చెప్పిందో, లేదా ఫ్లైదుబాయ్‌కి ఈ విషయం తెలుసో లేదో ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. నిరూపితమైన విషయాలు ఏవైనా, ఈ సంఘటన ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది. కాక్‌పిట్‌లో రెండవ అత్యంత విశ్వసనీయమైన సీటులో కూడా తనిఖీ వ్యవస్థలు విఫలమవుతాయి. అలా జరిగినప్పుడు, అప్పటికే ఆ ప్రదేశంలో ఉన్నవారే మొదట స్పందిస్తారు. ఆ వ్యక్తి ఏమి చేస్తాడనేది అత్యవసర పరిస్థితికి చాలా కాలం ముందు ఏర్పడిన అలవాట్లపై ఆధారపడి ఉంటుంది.

### ఇజ్రాయెల్ ఎందుకు ఎప్పుడూ అప్రమత్తతను వీడదు?

ఇజ్రాయెల్ పరిస్థితులు చాలా విషయాలను వివరిస్తాయి. ఈ రాజ్యం 1948లో వివాదాస్పద విభజన నుండి ఆవిర్భవించింది. ఐక్యరాజ్యసమితి బ్రిటిష్ పాలస్తీనా మాండేట్‌ను యూదు, అరబ్ రాజ్యాలుగా విభజించాలని ప్రతిపాదించింది. యూదు నాయకులు ఈ ప్రణాళికను అంగీకరించగా, అరబ్ నాయకులు దానిని తిరస్కరించారు. 1948 మేలో ఇజ్రాయెల్ స్వాతంత్ర్యం ప్రకటించుకున్నప్పుడు, పొరుగున ఉన్న అరబ్ దేశాలు దానిపై యుద్ధం ప్రకటించి తమ సైన్యాలను పంపాయి.

ఇజ్రాయెలీయులు ఈ సంఘర్షణను స్వాతంత్ర్య యుద్ధం అని పిలుస్తారు. పాలస్తీనియన్లు దీనిని నక్బా, అంటే విపత్తు అని పిలుస్తారు, దీనిలో లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ రెండు జ్ఞాపకాలు ఒకే సంఘటనను వివరిస్తాయి. ఈ వివాదం ఎన్నడూ పరిష్కారం కాలేదు. 1967లో ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్న భూభాగాలపై దాని నియంత్రణ ఈ వివాదాన్ని సజీవంగా ఉంచుతోంది. ఇజ్రాయెల్ విధానం పాలస్తీనియన్లలో, అలాగే చాలా ముస్లిం ప్రపంచంలో ఆగ్రహానికి మూలంగా మారింది. ఇజ్రాయెలీయులకు, ఈ సంఘర్షణ అంటే యుద్ధరంగం నుండి చాలా దూరంలో హింసను ప్రత్యక్షంగా చూడటమే.

1972లో, మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో పాలస్తీనా సాయుధులు 11 మంది ఇజ్రాయెల్ క్రీడాకారులను, కోచ్‌లను హతమార్చారు. దీనికి ప్రతిస్పందనగా మొస్సాద్, 'ఆపరేషన్ వ్రాత్ ఆఫ్ గాడ్' పేరుతో, బాధ్యులని భావించిన వారిని ఐరోపా, మధ్యప్రాచ్యం అంతటా వెంబడించింది. 1976లో, టెల్ అవీవ్ నుండి వస్తున్న ఒక ఎయిర్ ఫ్రాన్స్ విమానాన్ని ఎంటెబ్బేకు హైజాక్ చేశారు. అక్కడ ఇజ్రాయెల్ ప్రయాణికులను మిగిలిన వారి నుండి వేరు చేశారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ కమాండోలు చాలా మంది బందీలను విడిపించారు.

ఇంతిఫాదాల (పాలస్తీనా తిరుగుబాట్లు) సమయంలో బస్సులు, కేఫ్‌లపై బాంబు దాడులు జరిగాయి. వెస్ట్ బ్యాంక్‌లో, ఇజ్రాయెల్ లోపల కాల్పులు, కత్తిపోట్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. 2023 అక్టోబర్ 7న, హమాస్ నేతృత్వంలోని దుండగులు సుమారు 1,200 మందిని చంపి, 251 మందిని బందీలుగా పట్టుకున్నారు. దశాబ్దాలుగా, హింస ముప్పు ఇజ్రాయెల్ జీవితంలో ఒక సాధారణ విషయంగా మారింది; దానిని కాదనడం కాకుండా, అదుపులో ఉంచుకోవాల్సిన పరిస్థితిగా మారింది.

కేఫ్ లేదా మాల్ ప్రవేశద్వారం వద్ద బ్యాగుల తనిఖీలు, సైరన్‌లు, ప్రజా ఆశ్రయాలు అక్కడి పరిసరాల్లో సర్వసాధారణం. విమానాల్లోకి, స్టేడియంలలోకి, సరిహద్దులు దాటినా ప్రమాదం తమను వెంబడించగలదని ఇజ్రాయెలీయులు తెలుసుకున్నారు. ఆ హింసలో చాలా వరకు అపరిష్కృతంగా ఉన్న పాలస్తీనా సమస్యలోనే మూలాలు ఉన్నాయి. దశాబ్దాలుగా అరబ్ ప్రపంచంతో ఇజ్రాయెల్ సంబంధాలకు కూడా ఇదే నిబంధనను నిర్దేశించింది.

### హింసతో పాటు సాగిన దౌత్యం

కానీ, ఈ హింసతో పాటు దౌత్యం కూడా సాగింది. 1979లో ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందంపై సంతకం చేసిన మొదటి అరబ్ దేశంగా ఈజిప్ట్ నిలవగా, 1994లో జోర్డాన్ రెండవదిగా నిలిచింది. ఈ మధ్య కాలంలో, మార్గాలు తెరుచుకున్నాయి. గల్ఫ్ యుద్ధం తర్వాత, 1991 నాటి మాడ్రిడ్ సమావేశం ఇజ్రాయెల్, అరబ్ దేశాలు, పాలస్తీనియన్లను ప్రత్యక్ష చర్చలకు తీసుకువచ్చింది. ఆ తర్వాత 1993లో పి.ఎల్.ఓ.తో ఓస్లో ఒప్పందాలు జరిగాయి. గల్ఫ్ దేశాలతో సంబంధాలు చాలా వరకు రహస్యంగానే కొనసాగాయి: 1995లో ఒమన్, ఇజ్రాయెల్ వాణిజ్య కార్యాలయాలను పరస్పరం మార్చుకున్నాయి. ప్రభుత్వాలు ఉమ్మడి అభిప్రాయానికి వచ్చినా, పాలస్తీనియన్ల పట్ల ప్రజల సానుభూతి కొనసాగింది. 2020లో, అమెరికా అబ్రహం ఒప్పందాలకు మధ్యవర్తిత్వం వహించింది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), బహ్రెయిన్ సంబంధాలను సాధారణీకరించుకోగా, మొరాకో వాటిని అనుసరించింది. సూడాన్ సూత్రప్రాయంగా అంగీకరించగా, కజకిస్తాన్ 2025లో చేరింది. ఇరాన్ పట్ల ఉన్న ఉమ్మడి అప్రమత్తత, వాణిజ్య అవకాశాలే ఈ దేశాలను ముందుకు నడిపించాయి. ఆ తర్వాత ప్రత్యక్ష విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి.ఇది ఒక తరం క్రితం ఊహించలేని విషయం.

1950లో ఇజ్రాయెల్‌ను గుర్తించి, 1992లో మాత్రమే రాయబార కార్యాలయాలను తెరిచిన భారతదేశం, ఇప్పుడు దాని సైనిక ఎగుమతులకు అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. కానీ ప్రభుత్వాల మధ్య ఒప్పందాలు ప్రజల మధ్య ఉన్న మనోవేదనలను పరిష్కరించవు. ఈ వ్యవహారంలో సహ-పైలట్ ఒమన్. ఒమన్ ఈ ఒప్పందాలపై సంతకం చేయలేదు. అది ఇజ్రాయెల్‌తో అనధికారిక సంబంధాలను కొనసాగిస్తూ, 2018లో బెంజమిన్ నెతన్యాహుకు ఆతిథ్యం ఇచ్చింది.

అదే సమయంలో ఇరాన్‌తో సాధారణ సంబంధాలను కొనసాగిస్తూ, టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. రెండు-దేశాల పరిష్కారమే ఏకైక మార్గమని దాని అధికారులు చెబుతున్నారు. చాలా మంది




ఒమన్ వాసులు పాలస్తీనియన్ల పట్ల సానుభూతితో ఉన్నారు. ఏ జాతీయ విధానం కూడా ఒక వ్యక్తి ఏమి చేస్తాడో అంచనా వేయలేదు. ఇప్పటివరకు ఈ దాడితో ఒమన్ ప్రభుత్వానికి సంబంధం ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవు. అయినప్పటికీ, ప్రభుత్వాల మధ్య సంబంధాలు సాధారణ స్థితికి వచ్చినప్పటికీ, ఆ ప్రభుత్వాలు ప్రాతినిధ్యం వహించే సమాజాలలో ఇజ్రాయెల్ విధానాల పట్ల, కొన్ని సందర్భాల్లో యూదుల పట్ల కూడా ఉన్న శత్రుత్వం తొలగిపోలేదు. అందువల్ల, శాంతి ఒప్పందాలు భద్రతా భారాన్ని చాలా వరకు, పరిష్కారం కాని ఈ సమస్య పక్కన నివసించే పౌరులపైనే వదిలివేస్తాయి.

### బ్యారక్‌ల నుండి సామాన్యుల వరకు

భద్రతను ఒక ప్రభుత్వ విధిగా కాకుండా, ఒక పౌర అలవాటుగా పరిగణించడమే ఇజ్రాయెల్ స్పందన. నిర్బంధ సైనిక సేవయే దీనికి ప్రధాన సాధనం: పురుషులకు 32 నెలలు, మహిళలకు 24 నెలలు, ఆ తర్వాత రిజర్వ్ డ్యూటీ. సైనిక సేవ ప్రథమ చికిత్స, ఆయుధాలను వాడటం, ఒత్తిడిలో క్రమశిక్షణ, అసంపూర్ణ సమాచారంపై ఎలా స్పందిం చాలో నేర్పిస్తుంది. చాలా మంది యువ ఇజ్రాయెలీలు దీని ద్వారానే వెళ్తారు కాబట్టి, ఆ నైపుణ్యాలు సాధారణ ప్రజలలో కూడా ఉంటాయి.

అంతేకాక, ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రాణహాని ఉన్నప్పుడు ఎలా ప్రవర్తించాలో పౌరులు నేర్చుకునే పాఠశాలగా కూడా పనిచేస్తాయి. బ్యారక్‌లలో నివసించడానికి, వీధుల్లో నిలబడటానికి మధ్య ఉన్న గీత అస్పష్టంగా మారుతుంది. అతి-ఆర్థడాక్స్ పురుషులకు చాలా వరకు మిన హాయింపు ఉంది. చాలామంది అరబ్ పౌరులను సైన్యంలోకి నిర్బంధిం చరు, కానీ ఈ సంస్కృతి సైన్యంలో పనిచేసే వారిని మించి విస్తరించింది.

స్వచ్ఛంద సేవ ఈ అలవాటును పౌర జీవితంలోకి తీసుకువెళుతుంది. యునైటెడ్ హట్జాలా వేలాది మంది స్వచ్ఛంద వైద్య సిబ్బందిని సమన్వయం చేస్తుంది. వీరికి ఒక ఫోన్ యాప్ ద్వారా సమాచారం అందుతుంది. వీరు సుమారు మూడు నిమిషాల్లోనే అత్యవసర పరిస్థితులకు చేరుకుంటారని చెబుతున్నారు. సరిహద్దు, గ్రామీణ ప్రాంతాల్లో పౌర సహాయక బృందాలు అందుబాటులో ఉంటాయి. ప్రతి సందర్భంలోనూ, అత్యవసర పరిస్థితికి అత్యంత సమీపంలో ఉన్న వ్యక్తే సంఘటనా స్థలానికి మొదటగా చేరుకోవాలనేది లక్ష్యం.

ఈ నేపథ్యంలో చూస్తే, ఎఫ్ జెడ్ 1073 కేసును సంయమనంతో విశ్లేషించాలి. నిర్బంధ సైనిక సేవ వల్ల కలిగే ప్రయోజనాలను ఒకే ఒక్క సంఘటన నిరూపించలేదు. అలాగే కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లిన ప్రయాణికులు సైన్యంలో పనిచేశారా లేదా అనే విషయం కూడా నివేదికలలో లేదు. ఆ కథనాలు వర్ణించేది ఒక పరిస్థితిని మాత్రమే: ఒక ప్రయాణికుడు కాక్‌పిట్ వైపు పరుగెత్తడం, యువకులు దాడి చేసిన వ్యక్తితో పోరాడటం, ఒక దంతవైద్యుడు కెప్టెన్ గాయాలపై ఒత్తిడి కలిగించడం.

కిందకు దూసుకెళ్తున్న విమానంలో, ఎవరు బ్రతుకుతారో క్షణాలే నిర్ణయిస్తాయి. ప్రయాణికులకు ఎలాంటి సూచనలు అవసరం లేదు;. వారి సహజ ప్రవృత్తి చాలా చురుకుగా ఉంది. వారు వెంటనే దాని ప్రకారమే ప్రవర్తించారు.

### భారతదేశం దీని నుండి ఏమి నేర్చుకుని, స్వీకరించగలదు?

భారతదేశం, ఇజ్రాయెల్ రెండూ కెప్టెన్ మచ్చర్‌ను సముచితంగా కీర్తించాయి. కానీ ఆ ప్రశంసల వెనుక ఒక కఠినమైన ప్రశ్న తలెత్తుతుంది: ఇది మనకు జరగవచ్చా? ఒక భారతీయ విమానంపై ఇలాంటి దాడి జరిగే అవకాశాలు చాలా తక్కువ. అయినప్పటికీ, భారతదేశం పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం నీడలో జీవిస్తోంది. ఒక ఉగ్రదాడి, అగ్నిప్రమాదం, తొక్కిసలాట లేదా దాడి వంటివి ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్న జనసమూహాన్ని పట్టుకోగలవు. బయటి వారిచే ప్రేరేపించే అంతర్గత భద్రతా ముప్పులు ఉన్న ఈ కాలంలో, సైన్యం, పోలీసు లేదా గూఢచార సేవల్లో యూనిఫాంలో ఉన్న జనాభా వాటా చాలా తక్కువ. వారికి కళ్ళు, చెవులుగా పనిచేయగల, స్పష్టంగా సంభాషించగల, అవసరమైనప్పుడు స్వతంత్రంగా వ్యవహరించగల పౌరుల ద్వారా ఈ లోటును భర్తీ చేయాలి.

భారతదేశ భద్రతా వాతావరణం ఇజ్రాయెల్ కంటే భిన్నంగా ఉంటుంది. తన ప్రజలలో భద్రతా చైతన్యాన్ని పెంపొందించడానికి నిర్బంధ సైనిక సేవ అవసరం లేదు. భారతదేశంలో ఇప్పటికే ఉన్న పౌర-సైనిక సంస్థలతో దీనిని సాధించవచ్చు. ఇజ్రాయెల్ ఏజెన్సీలు లేదా ఎన్జీఓల సమన్వయంతో, కొన్ని జిల్లాలలో పౌర అత్యవసర ప్రతిస్పందన శిక్షణపై ఒక సంవత్సరం పాటు పైలట్ ప్రాజెక్ట్‌ను నిర్వహించి, ప్రజలు ఎలా స్పందిస్తున్నారో అంచనా వేసి, ఆపై దానిని విస్తరించవచ్చు, మార్చవచ్చు లేదా నిలిపివేయవచ్చు.

స్వయంప్రతిపత్తి గల బృందాలను సృష్టించడం దీని లక్ష్యం కాదు. మంచి శిక్షణ ఎప్పుడు పరుగెత్తాలో, ఎప్పుడు దాక్కోవాలో, ఎప్పుడు సహాయం చేయాలో నేర్పుతుంది. ఇది పెంపొందించేది ఏమిటంటే, అత్యవసర పరిస్థితి తలెత్తిన మొదటి నిమిషాలు గదిలో ఉన్న ప్రజలవేనని, వాటితో ఏమి చేయాలో వారికి తెలుసనే అంచనాను.

ఎఫ్ జెడ్1073 విమానంలోని ప్రయాణికులకు ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేదు. ఇజ్రాయెల్ పౌర భద్రతా సంస్కృతి ప్రకారం, వారు చేసిన పనిని కేవలం ఒక సంఘటనతో నిరూపించలేమని వివరిస్తుంది. కానీ, విమానయానం లేవనెత్తే ప్రశ్నను అడగడానికి భారతదేశానికి స్వయంగా కాక్‌పిట్ అత్యవసర పరిస్థితి అవసరం లేదు: ఒకవేళ అత్యంత ఘోరం జరిగితే, సామాన్య పౌరుడు ఏమి చేయాలో తెలుసుకుంటాడా?

(చక్రధారి రోవ్ ఢిల్లీకి చెందిన ఒక భద్రతా నిపుణుడు. ఇంటర్నేషనల్ సెక్యూరిటీ అకాడమీ (హెర్జ్లియా, ఇజ్రాయెల్) సలహా మండలి సభ్యుడు. మాక్స్‌గ్రిడ్ సెక్యూరికోర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సీనియర్ సలహాదారు. 2016లో ఇజ్రాయెల్‌లో నివసించిన తర్వాత, ఆయన భారతదేశపు మొట్టమొదటి పౌర భద్రతా ఆపరేటింగ్ మాన్యువల్ 'షీప్‌డాగ్, ది అవేకెన్డ్ ఇన్ 2025'ను రచించారు. ప్రస్తుతం భారతదేశంలో పౌర భద్రతా సంస్కృతిని నిర్మించే పనిలో ఉన్నారు.)



(యురేషియా రివ్యూ నుండి)

- 'నిజంటుడే' సౌజన్యంతో

# దివ్యాంగుల పింఛన్లకు భారీ ఊరట!

**80 శాతం నుంచి 40 శాతానికి వైకల్య అర్హత తగ్గింపు**

**పుట్టినప్పటి నుంచే అర్హులైన దివ్యాంగ చిన్నారులకు పింఛన్**

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి**



న్యూఢిల్లీ, మహానాడు: దేశంలోని పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించి, 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్లపాటు రూ.53,428 కోట్ల వ్యయంతో కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం పేద కుటుంబాలకు మరింత భరోసానిస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల హక్కుల చట్టం-2016కు అనుగుణంగా పింఛన్ అర్హతలను విస్తరించడం కీలక నిర్ణయమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకు కనీసం 80 శాతం వైకల్యం ఉన్నవారికి వర్తించిన పింఛన్‌ను ఇకపై 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికీ వర్తింపజేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు అందించే కేంద్ర పింఛన్ సహాయాన్ని 25 శాతం పెంచనున్నట్లు వెల్లడించారు.

పింఛన్ పొందేందుకు ఉన్న 18 ఏళ్ల కనీస వయోపరిమితిని తొలగించడంతో పుట్టినప్పటి నుంచే అర్హులైన దివ్యాంగ చిన్నారులకు ఆర్థిక సహాయం అందనుందని చెప్పారు. చిన్నారికి 18 ఏళ్లు వచ్చే వరకు తల్లిదండ్రుల ద్వారా ఈ సహాయం అందిస్తారని వివరించారు.

ఈ నిర్ణయంతో ప్రస్తుతం 8.33 లక్షలుగా ఉన్న దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 27.48 లక్షలకు పెరగనుందని, అంటే దాదాపు 3.3 రెట్లు అధికమవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఈ పథకానికి ఏడాదికి రూ.290 కోట్లు ఖర్చవుతుండగా, ఇకపై ఆ వ్యయం రూ.1,268 కోట్లకు పెరగనుందని పేర్కొన్నారు. అదనంగా 19.15 లక్షల మంది దివ్యాంగులు పింఛన్ ప్రయోజనాలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు.

### ఐదేళ్లలో రూ.53,428 కోట్ల వ్యయం

2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్లలో ప్రతి ఆర్థిక సంవత్సరానికి రూ.10,685.60 కోట్ల చొప్పున ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. మొత్తంగా రూ.53,428 కోట్లను సామాజిక భద్రత పథకాల కోసం వెచ్చించనున్నట్లు వివరించారు. దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన కొత్త అర్హతలు, పెరిగిన లబ్ధిదారుల పరిమితి, పెంచిన సహాయ మొత్తాలను వచ్చే మూడు నెలల్లో అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రత పథకాల ద్వారా 7.28 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. తాజా మార్పులతో ఈ సంఖ్య మరింత పెరగనుందని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ఆయా పథకాల కింద రూ.2,132 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేసిందన్నారు.

పేదరికంతోపాటు వృద్ధాప్యం, వైకల్యం లేదా కుటుంబాన్ని పోషించే వ్యక్తిని కోల్పోవడం వల్ల కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు ఈ పథకాలు దోహదపడతాయని చెప్పారు. ముఖ్యంగా దివ్యాంగ చిన్నారులకు పుట్టినప్పటి నుంచే సహాయం అందించడం, మరింతమందిని పింఛన్ పరిధిలోకి తీసుకురావడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.

సమాజంలోని బలహీన వర్గాలకు భరోసా కల్పించే చర్యలు తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# స్టార్‌లింక్‌తో జాతీయ భద్రతకు ముప్పు

**- నిషేధించండి**

**స్వదేశీ జాగరణ్ మంచ్ డిమాండ్**

భారతదేశంలో వాణిజ్య శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ప్రారంభించకుండా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్‌ను అడ్డుకోవాలని స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) ప్రభుత్వాన్ని కోరింది. స్టార్‌లింక్ సేవలతో జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడుతుందని ఎస్‌జేఎం జాతీయ కో-కన్వీనర్ అశ్వనీ మహాజన్ హెచ్చరించారు.

"ప్రస్తుతం, భారతదేశం వివిధ శాంతిభద్రతల సవాళ్లతో పోరాడుతోంది. ఇటువంటి పరిస్థితులలో, ఇంటర్నెట్ ఆధారిత సోషల్ మీడియా తరచుగా పుకార్లను, దేశ వ్యతిరేక కథనాలను మరింతగా రెచ్చగొడుతుంది," అని ఆయన గుర్తు చేశారు.



"వేర్పాటువాదం, ఉగ్రవాదం, అల్లర్లు, నిరసనలు, ఇలాంటి సంఘటనల" సమయంలో శాంతిభద్రతలను కాపాడటానికి ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగించడం తరచుగా అవసరమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో స్టార్‌లింక్ సేవలను అందుబాటులోకి తేవడంలో వస్తున్న జాప్యంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీని మస్క్ బహిరంగంగా లక్ష్యంగా చేసుకున్న కొద్ది రోజులకే ఈ డిమాండ్ వచ్చింది.

"కొందరు కుబేరులు" తమ "గుత్తాధిపత్య పట్టు"ను కాపాడుకోవడానికి స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నారని మస్క్ మొదట ఆరోపించారు. ఆ తర్వాత ఎక్స్ లో, "భారతదేశానికి అసలైన బాస్ అంబానీనా?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ ఆరోపణను తిరస్కరిస్తూ, తమ నియంత్రణ వ్యవస్థ "నిష్పక్షపాతంగా, వివక్షారహితంగా" ఉందని, వివక్షాపూరిత వైఖరి ఉందన్న సూచనలు "నిరాధారమైనవి, అపోహలతో కూడినవి" అని పేర్కొంది.

ముఖ్యంగా, స్టార్‌లింక్, రిలయన్స్ జియో, భారతీ మద్దతు ఉన్న యూటెల్‌శాట్ వన్‌వెబ్‌లకు లైసెన్సులు లభించాయని, అయితే స్పెక్ట్రమ్ కేటాయింపు, వాణిజ్య కార్యకలాపాలకు వెళ్లే ముందు భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని నిరూపించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ మూడింటి భద్రతా మదింపులు జరుగుతున్నాయని, అవి "స్థూలంగా ఒకే నియంత్రణ దశలో" ఉన్నాయని కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆ తర్వాత కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, భద్రతా అనుమతులు హోం మంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు.

ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో ఎస్‌జేఎం ప్రకటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. అక్కడ అధికారులు సమీకరణను నియంత్రించడం, ప్రజాశాంతిని కాపాడటం లక్ష్యంగా పలు నివారణ చర్యలు తీసుకున్నారు. స్టార్‌లింక్ సాంకేతికతను ప్రస్తుత టెలికాం నెట్‌వర్క్‌లతో పోలుస్తూ, ప్రభుత్వం ఆదేశించినప్పుడు ప్రస్తుత ఆపరేటర్లు నిర్దిష్ట ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయవచ్చని లేదా పరిమితం చేయవచ్చని, అలాగే భద్రతా, దర్యాప్తు సంస్థలకు సహకరించవచ్చని ఎస్‌జేఎం వాదించింది.

స్టార్‌లింక్ ఉపగ్రహాలు లేజర్ లింక్‌ల ద్వారా ఒకదానితో ఒకటి సంభాషించుకోగలవు, దీనివల్ల గ్రౌండ్ స్టేషన్‌కు చేరకముందే ఉపగ్రహాల మధ్య డేటా ప్రయాణించగలదు. అందువల్ల, స్టార్‌లింక్ ఉపగ్రహ నిర్మాణం ఒక ప్రత్యేక సవాలును విసురుతోందని ఎస్‌జేఎం పేర్కొంది.

ఆ సంస్థ ప్రకారం, భారతదేశంలో ప్రారంభమయ్యే ఇంటర్నెట్ ట్రాఫిక్ దేశీయ గేట్‌వేలను దాటవేయకుండా ప్రభుత్వం నిర్ధారించాలి. అలాగే, భద్రత లేదా శాంతిభద్రతల పరిస్థితిలో ఆదేశిస్తే, స్టార్‌లింక్ ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలో తన సేవలను కచ్చితంగా పరిమితం చేయగలగాలి.

"ప్రభుత్వం ఆదేశాల మేరకు స్టార్‌లింక్ తన సేవలను కచ్చితంగా పరిమితం చేయగలగడం ఒక కీలకమైన నియంత్రణ షరతు; అయితే, ఈ ఆవశ్యకతను తీర్చడానికి స్టార్‌లింక్ కట్టుబడి లేదు, లేదా దాని సాంకేతికత దానికి అనుమతించకపోవచ్చు," అని ఎస్‌జేఎం ఆరోపించింది.

అంతరాయం, అమలుపై ఆందోళనలు

విదేశీ మౌలిక సదుపాయాల ద్వారా ప్రయాణించే భారతీయ ఇంటర్నెట్ ట్రాఫిక్, చట్టబద్ధమైన అంతరాయం, అమలును మరింత కష్టతరం చేయగలదని అది వాదించింది. సాంప్రదాయ టెలికాం నెట్‌వర్క్‌ల వెలుపల తిరుగుబాటుదారులు, స్మగ్లర్లు, ఇతర శత్రు శక్తులు కూడా శాటిలైట్ ఇంటర్నెట్ టెర్మినల్స్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉందని అది పేర్కొంది.

సున్నితమైన ప్రాంతాలలో అనధికారిక స్టార్‌లింక్ టెర్మినళ్లను కనుగొన్నారని, దర్యాప్తు సమయంలో భద్రతా సంస్థలు స్టార్‌లింక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నాయని కూడా ఆ సంస్థ పేర్కొంది. దేశీయ టెలికాం, శాటిలైట్-ఇంటర్నెట్ సామర్థ్యాలకు మద్దతుగా ఈ వివాదాన్ని ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ ఉపయోగించుకుంది.

ప్రస్తుత టెలికాం ఆపరేటర్లు భద్రతా, దర్యాప్తు సంస్థలకు సహకరించారని, ప్రభుత్వానికి అవసరమైనప్పుడు సేవలను పరిమితం చేయడానికి వారి సాంకేతికత వీలు కల్పిస్తుందని అది పేర్కొంది. మస్క్ ప్రస్తుత వ్యాపార ప్రయోజనాల ప్రభావాన్ని బహిరంగంగా విమర్శిస్తున్న తరుణంలో, ఈ ప్రకటన శాటిలైట్ ఇంటర్నెట్‌పై కఠినమైన నియంత్రణలకు అనుకూలంగా భద్రతా వాదన వైపు ఎస్‌జేఎంను నిలబెట్టింది.

రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ భారతదేశపు టెరెస్ట్రియల్ టెలికాం మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తుండగా, ఈ రెండింటికీ శాటిలైట్-ఇంటర్నెట్ రంగంలో కూడా ఆసక్తులు ఉన్నాయి. జియోకు ఎస్ఈఎస్‌తో ఒక శాటిలైట్ వెంచర్ ఉండగా, వన్‌వెబ్‌ను నిర్వహిస్తున్న యూటెల్‌శాట్‌లో భారతీ ఒక ప్రధాన వాటాదారు. అయితే, భారతదేశంలో స్టార్‌లింక్ సేవల పంపిణీని అన్వేషించడానికి ఈ రెండు కంపెనీలు గత సంవత్సరం స్పేస్‌ఎక్స్‌తో కూడా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

దేశీయ ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించండి, అమెరికాకు సందేశం పంపండి

స్టార్‌లింక్‌ను అనుమతించకపోవడం వల్ల, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల కోసం దేశీయ ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సామర్థ్యాల అభివృద్ధిని వేగవంతం చేసే అవకాశం లభిస్తుందని ఎస్‌జేఎం వాదించింది. "దేశీయ ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడంలో కొంత జాప్యం జరిగినా, జాతీయ భద్రతకు భంగం కలగకుండా స్టార్‌లింక్ కంటే చాలా తక్కువ ధరకే మనం సేవలను అందించగలము," అని మహాజన్ పేర్కొన్నారు.

భారతదేశంలో 5జి సేవలను ప్రవేశపెట్టే సన్నాహాల సమయంలో చైనా టెలికాం పరికరాల తయారీ సంస్థలైన హువావే, జెడ్ టిఈలను వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఈ సంస్థ గుర్తుచేసింది. అప్పుడు కూడా తమ అభ్యంతరాలు జాతీయ భద్రతా కారణాలపైనే ఆధారపడి ఉన్నాయని పేర్కొంది.

అమెరికాతో భారతదేశానికి ఉన్న వాణిజ్య సంబంధాలకు కూడా ఎస్‌జేఎం తన డిమాండ్‌ను ముడిపెట్టింది. "స్టార్‌లింక్‌ను అడ్డుకోవడం ద్వారా అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు ఒక సందేశం వెళ్తుంది: జాతీయ భద్రత పేరుతో అధిక సుంకాలు విధించి, హస్తకళల వంటి భారతీయ దిగుమతులపై ఏకపక్షంగా ఆంక్షలు విధించే సాహసం వారు చేసినప్పుడు, నిజమైన జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా స్టార్‌లింక్‌ను అడ్డుకునే హక్కు ఖచ్చితంగా భారతదేశానికి ఉంది," అని మహాజన్ స్పష్టం చేశారు.

స్టార్‌లింక్‌కు సంబంధించిన భద్రతాపరమైన అంశాలను పరిష్కరించడానికి బదులుగా, ప్రభుత్వంపై ప్రజా ఒత్తిడిని సృష్టించడానికి ఎలాన్ మస్క్ ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన చేసిన ఇటీవలి వ్యాఖ్యలపై కూడా ఆ సంస్థ విమర్శలు గుప్పించింది.

"ఆ నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి స్టార్‌లింక్ సిద్ధంగా లేనట్లు కనిపిస్తోంది. దీనివల్ల, ఎలాన్ మస్క్ ప్రభుత్వంపై ప్రజా ఒత్తిడిని సృష్టించి లైసెన్స్ పొందాలని ప్రయత్నిస్తున్నారని లేదా అసహనంతో ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని అనిపిస్తోంది," అని ఆ సంస్థ పేర్కొంది.

Published by Bodepudi Vignesh, Managing Director on behalf of Mahanadu Media Pvt. Ltd. Editor: Marthi Subrahmanyam Phone: 9705311144, 8538888999